
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY



నల్లగొండ
5
ఆదివారం 11 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.160	240	270
సూర్యాపేట	రూ.150	230	260
నల్లగొండ	రూ.147	213	243

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 24.2

నమో.. నారసింహ



తిరువీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న అర్చకులు



కాళీయ మర్దనుడి అలంకరణలో స్వామివారు

- లక్ష్మీనారసింహుడికి లక్ష పుష్పార్చన
- కాళీయ మర్దనుడు, శ్రీ రామ అలంకరణలు
- రాత్రి హనుమంత వాహనంపై ఊరేగింపు
- సహస్రనామ పారాయణం, అభిషేకాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ప్రధానాలయం, పాతగుట్ట ఆలయంలో ఏకకాలంలో వార్షిక జయంత్యుత్సవాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఆలయంలో నిత్యారాధనల అనంతరం ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాందూరి వెంకటాచార్యుల బృందం గర్భాలయానికి అభిముఖంగా నిత్య నరసింహమూర్తి, మూల మంత్ర హవనాలు, లక్ష్మీ సూక్త, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణాలు, అభిషేకాలు, నవకలశ స్నపనం, లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు స్వామివారిని కాళీయమర్దన కృష్ణాలంకరణలో దివ్యమనోహరంగా అలంకరించారు. దివ్య ప్రబంద పాశుర పఠనాలు, వేద పారాయణంతో తిరువీధుల్లో ఊరేగించి సేవించారు. సాయంత్రం యాగశాలలో బింబం, కుంభం, మండలం ప్రయోగాల ద్వారా చతుస్థానార్చన పూర్వకంగా నిత్య హవనాలు, సామూహిక పారాయణం, నృసింహ మూలమంత్ర హవనాలు నిర్వహించారు. స్వామివారిని శ్రీరామ అలంకరణలో హనుమంత వాహనంపై తిరువీధిలో ఊరేగించారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

7



బుద్ధవనం ఏరియల్ వ్యూ

ముద్దుగుమ్మల కోసం

బుద్ధవనం సిద్ధం

రేపు నాగార్జునసాగర్‌కు రానున్న ప్రపంచ అందగత్తెలు

నాగార్జునసాగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటకశాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్‌వరల్డ్-2025 పోటీలు శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాల సందర్శన ఉన్నందున బుద్ధపూర్ణిమ సందర్భంగా ఈ నెల 12వ తేదీన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనానికి ఆసియా దేశాలకు చెందిన 30 మంది మిస్‌వరల్డ్ పోటీదారులు రానున్నారు. దీంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మిస్‌వరల్డ్ పోటీదారులు విశ్రాంతి తీసుకునే విజయవిహార్ అతిథి గృహాన్ని, బుద్ధవనాన్ని అధికారులు ముస్తాబు చేశారు. బుద్ధవనంలో మహాస్తూపానికి, అలాగే అన్ని చెట్లకు, ఇతర స్తూపాలకు లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. బుద్ధవనం నుంచి విజయవిహార్ వరకు 2కిలోమీటర్ల మేర విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్లు పర్యాటకశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే పలు మార్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, అటవీశాఖ, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి పోటీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆదివారం నుంచి బుద్ధవనం, విజయవిహార్‌ను పోలీసులు పూర్తిగా ఆధీనంలోకి తీసుకోనున్నట్లు సమాచారం.

పర్యటన ఇలా..

బుద్ధపూర్ణిమ సందర్భంగా ఈ నెల 12వ తేదీన మిస్‌వరల్డ్ పోటీదారులు నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. వారు మధ్యాహ్నం 1 గంటలకు హైదరాబాద్ నుంచి మిగతా 7వ పేజీలో...

వెయ్యి ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్

ఇండస్ట్రియల్ పార్క్?



చిట్యాల మండలం వెలిమినేడులో శివారులో ఇండస్ట్రియల్ పార్క్‌లో కంపెనీల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న దక్షిణం వైపు భూమి, బోర్డుపాతిన టీఎస్‌ఐఐసీ

- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి, వెలిమినేడు, గుండ్రాంపల్లిలో ఏర్పాటుకు యోచన
- ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సూచన
- టీఎస్ఐఐసీకి 162.28 ఎకరాల భూమి అప్పగింత, మరో 500 ఎకరాలకు గెజిట్ జారీ
- భూసేకరణ అనంతరం ఏడాదిలోపు వివిధ రకాల పరిశ్రమలు
- కార్మికులకు ఇంటిగ్రేటెడ్ హౌసింగ్ కాంప్లెక్స్, ఇళ్లు, పాఠశాల
- ఇప్పటికే ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటైన ఓ కంపెనీ
- భూములిచ్చేది లేదని వ్యతిరేకిస్తున్న స్థానిక రైతులు

కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్ హంగు ఆర్భాటాలతో ఏర్పాటు కానుంది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములతోపాటు వాటి చుట్టుపక్కల గల పట్టా భూములను సేకరించి ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. అంతేనా.. అంతో ఇంతో కాకుండా 1000 ఎకరాలను సేకరించి ఇండస్ట్రియల్ పార్క్‌కు అనువుగా ఉండేలా భూసేకరణ జరుగనుంది. అందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. భూసేకరణ చేపట్టి ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అక్కడి నుంచి జిల్లాకు ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. ఇక రానున్న రోజుల్లో చిట్యాల మండలంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కావడం ఖాయంగా కనిపిస్తుంది.

● ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్

ఇండస్ట్రియల్ పార్క్.. ఈ మాట నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ ప్రజలకు సుపరిచితమే. ఎందుకంటే ఇక్కడ రెండు, మూడేళ్లుగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కానుందని ప్రభుత్వానికి చెందిన పలు సర్వే నంబర్లలోని 162.28 ఎకరాల భూమిని చదునుచేసి గత ప్రభుత్వంలో టీఎస్ఐఐసీకి అప్పగించారు. ప్రభుత్వ భూమితోపాటు ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు, వాటి పక్కన ఉన్న పట్టాభూములను కూడా సేకరించి ఆ భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు గత ప్రభుత్వం హయాంలో ప్రతిపాదన వచ్చింది. 162.28 ఎకరాల భూమిని అప్పగించాక, మరో 500 ఎకరాలకు గెజిట్‌ను కూడా జారీచేశారు. దీంతో తమ భూములను ఇచ్చేది లేదని అసైన్డ్‌దారులు, పట్టాదారులు ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు చేశారు. ఆ తర్వాత ఏడాదికి పైగా ఆ విషయాన్ని మరచిపోయినట్లు స్తబ్దుగా ఉంది. అయితే ఈ ప్రాంతంలో భూమిని సేకరించి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం మళ్లీ సన్నాహాలు చేస్తోంది. అందుకోసం కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. వెలిమినేడులో ఉత్తరం, దక్షిణం వైపు భాగాల్లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం ఉన్న భూములను చదును చేయడం, రాళ్లను తొలగించడంతోపాటు గుట్టల మధ్య రోడ్లు కూడా నిర్మిస్తున్నారు. వాహనాలు వెళ్లేందుకు రోడ్లను ముస్తాబుచేశారు. కంపెనీలు ఏర్పాటు చేస్తే వాటికి విద్యుత్ సౌకర్యంకోసం స్తంభాలు, వైర్లను సిద్ధం చేశారు. ఇప్పటికే వెలిమినేడు శివారులో ఉత్తరం వైపున ఓ కంపెనీ ఏర్పాటైంది. ఈ ప్రాంతం జాతీయ రహదారికి దగ్గరగా, హైదరాబాద్‌లోని విమానాశ్రయానికి చేరువలో ఉండటం, రైల్వే మార్గం, అన్ని రవాణా వసతులు ఉండటంతో భారీ ఎత్తున ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటుచేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.

చిట్యాల మండలంలో 1000 ఎకరాల్లో భూసేకరణ

ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం చిట్యాల మండలం వెలిమినేడుతోపాటు పెద్దకాపర్తి, గుండ్రాంపల్లి గ్రామాల్లో భూములను సేకరించనున్నారు. ఆయా గ్రామాల్లో 1000 ఎకరాల్లో భూసేకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా భూసేకరణ కోసం ఐటీ, పరిశ్రమలశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ జిల్లా అధికారులకు సూచనలు చేసినట్లుగా తెలిసింది. ఆయా గ్రామాల్లో 1000 ఎకరాల్లో భూసేకరణ జరిగితే ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తే, అందులో పలు రకాల కంపెనీలు స్థాపిస్తారు.

500 ఎకరాలకు గెజిట్ జారీ

వెలిమినేడు ప్రాంతంలో ప్రభుత్వ భూములున్న ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ మిగతా 7వ పేజీలో...

కదిలే దేవత అమ్మ!

- నేడు ప్రపంచ మాతృ దినోత్సవం



అమ్మను మించి దైవమున్నదా..? అమ్మను మించి అర్థమున్నదా..? జగమే పలికే శాశ్వతమిదే.. అందరినీ కనే శక్తి అమ్మ ఒక్కతే.. అవతార పురుషుడు అయినా ఓ అమ్మకు కొడుకే..

పెదవే పలికిన మాటల్లోనే తీయని మాటే అమ్మ.. కదిలే దేవత అమ్మ.. కంటికి వెలుగు అమ్మ.. తనలో మమతే కలిపి పెడుతుంది ముద్దగా.. తన లాలిపాటలోని సరిగమ పంచుతుంది ప్రేమ మధురిమ..

అమ్మ పాడే.. జోల పాట.. అమృతానికన్నా తీయనంట..
అమ్మ పాడే.. లాలి పాట.. తేనెలూరిపారె ఏరులంట..
నిండు జాబిలి చూపించి.. ఉగ్గును పట్టి ఊయలలూపే అమ్మ లాలన..
ఊపిరి పోసి నూరేళ్ల నిండు దీవెన..

ఎంతో మంది సినీ రచయితలు ఇలా అమ్మగురించి పాడిన పాటలు అమ్మలోని గొప్పతనానికి నిదర్శనం.. నేడు ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం 6లో..

పనులు త్వరతగతిన పూర్తి చేయాలి

- ఇరిగేషన్ ప్రాజెక్టు పనులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష
- పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బీఎల్‌ఆర్

మిర్యాలగూడ టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణ పరిధిలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులతో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి శనివారం ఆమె మిర్యాలగూడ పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని తడకమళ్ల సర్కిల్, వైజంక్షన్, సాగర్‌రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కళాభారతిలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పౌరసేవలు విస్తరించాలన్నారు. అవసరమైతే అదనపు ఉద్యోగులను పురపాలికలో నియమించుకోవాలన్నారు. రహదారులు విస్తరించాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ఉన్న ఫౌంటెన్లను సరిచేయాలన్నారు. పట్టణంలో నిత్యం వెలువడుతున్న 50 టన్నుల వ్యర్థాలు డంప్ చేసేందుకు అనువైన డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేసేందుకు స్థలం ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత డంప్ యార్డుతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ రద్దీని నివారించాలని, ఆ ప్రాంతంలో మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పై అంశాలకు అవసరమైన ప్రతిపాదనలను తన కార్యాలయానికి పంపాలని సూచించారు. మునిసిపల్ శాఖకు రెవెన్యూ, ఆర్ అండ్‌బీ అధికారులు సహకరించాలని సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, డీఎస్పీ రాజశేఖరరాజు, మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, తహసీల్దార్ లచ్చిరాం, వెంకటరమణ, వెంకన్న, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి

ఇరిగేషన్ ప్రాజెక్టు పనులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ కింద భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో తదుపరి ప్రక్రియ మొదలుపెట్టాలని, చెల్లింపులకు చర్యలు తీసుకోవాలన్నారు. సాగర్ నియోజకవర్గంలోని నిడమనూరు చెరువుకు సాగర్ మెయిన్ కెనాల్ నుంచి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దున్నపోతులగండి, వీర్లపాలెం లిఫ్ట్‌లకు భూసేకరణ చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఇరిగేషన్ ఎస్ఈ మల్లిఖార్జున్, ఈఈ కరుణాకర్, డీఈ కేశవ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

భారతసైన్యానికి మనోధైర్యం ఇవ్వాలి

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్

మునుగోడు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై యుద్ధం చేస్తున్న భారతసైన్యానికి మనోధైర్యం ఇవ్వాలని కేదారేశ్వరస్వామి దేవుడిని ప్రార్థించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండల పరిధిలోని కోతులారం గ్రామంలో సాగుతున్న పార్వతీ సమేత కేదారేశ్వరస్వామి ఆలయం, నాభిశిల బొడ్రాయి తృతీయ వార్షికోత్సవ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందుండాలని, 400 ఏళ్ల చరిత్ర కల్గిన కేదారేశ్వరస్వామిని ప్రార్థించినట్లుగా తెలిపారు. పురాతన ఆలయం దీవెనలతో గ్రామస్థులు, సుఖసంతోషాలతో జీవించాలన్నారు. భవిష్యత్తులో ఈ ఆలయం తెలంగాణలోనే దివ్యక్షేత్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఆలయ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పున్న కైలాష్ నేత, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్, నాయకులు వట్టికోటి శేఖర్, మేకల ప్రమోద్‌రెడ్డి, పాల్వాయి జితేందర్‌రెడ్డి, భీమనపల్లి సైదులు, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, జాల వెంకన్న యాదవ్, పాలకూరి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు కలిసి

ప్రభుత్వాన్ని నడపాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, మే 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రభుత్వాన్ని ముందుకు నడపాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. శనివారం నల్లగొండలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు వివరించారని, వారంతా ప్రభుత్వంతో ఏకీభవించి అభివృద్ధిలో కలిసి వస్తున్నారన్నారు. ప్రపంచ సుందరీమణుల పోటీలకోసం ఇప్పటికే నాలుగైదు నెలల నుంచి సన్నాహాలు కొనసాగుతున్నాయని, ఇది ఒక్కదేశానికో, రాష్ట్రానికో సంబంధించిన వ్యవహారం కాదని, ప్రపంచ దేశాలన్నీ ఈపోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తాయని వెల్లడించారు. ప్రపంచసుందరీమణుల పోటీలకు, ఉగ్రవాదంపై జరుపుతున్న దాడులకు సంబంధం లేదన్నారు. దేశంలో ఏ రూపంలో ఉన్నా ఉగ్రవాదాన్ని అంతం చేసే సమయం ఆసన్నమైందని, ఉగ్రవాదులను తుదముట్టించడమే లక్ష్యంగా భారత భద్రతాదళాలు చేస్తున్న చర్యలకు దేశమంతా మద్దతిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు దేశరక్షణ నిధికి తాను ఒకనెల వేతనాన్ని అందిస్తానని, అదేవిధంగా ఎమ్మెల్సీలంతా తమ ఒక నెల వేతనం ఇచ్చే అంశంపై వారందరితో మాట్లాడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. భారతదేశంలో పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదాన్ని తుదుముట్టించాలని, పీవోకేని స్వాధీనం చేసుకోవడమే ఇందుకు మార్గమని సుఖేందర్‌రెడ్డి అన్నారు.



దేశ ఐక్యత, సమగ్రతకు కృషి చేయాలి

- నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు నెల జీతం విరాళం
- ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతకు, సమగ్రతకు కృషి చేయాలని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనికులు అహర్నిశలు పోరాడుతున్నారని అన్నారు. దాయాది దేశం పాకిస్థాన్ చేస్తున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఉగ్ర స్థావరాలపై విరుచుకు పడుతున్న భారత త్రివిధ దళాలకు మద్దతు తెలిపారు. తన ఒక నెల వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తున్నట్లు ప్రకటించారు.


కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతించారు. తక్షణమే చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్పందించి తన విరాళాన్ని ప్రకటించారు. సహచర లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు కూడా తమ విరాళాలను అందించాలని అభ్యర్థించారు.

కదిలే దేవత అమ్మ!

"అమ్మ పునర్జన్మనెత్తుతూ.. బిడ్డకు జన్మనిస్తుంది. పొత్తిళ్లలో పసికందును చూసి, ప్రసవ వేదనను మరిచిపోతుంది. ఏడిస్తే స్తన్యమిచ్చి ఆకలితీరుస్తుంది. బుజ్జగిస్తూ బువ్వపెట్టి, జోలపాడి నిద్రపుచ్చుతుంది. తన త్యాగపు పునాదులమీద మన బతుకు సౌదాన్ని నిర్మించిన ఆ మాతృమూర్తికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం? కదిలే దేవతకు ఎలా కృతజ్ఞతలు చెప్పగలం?"

● నేడు ప్రపంచ మాతృ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)



కనిపించే దైవం అమ్మ. ఆత్మీయతకు, అనురాగానికి, త్యాగానికి చిరునామా. అమ్మ అనే పిలుపులోనే తీయదనం ఉన్నది. తన కడుపు మాడ్చుకొని మరీ మన కడుపు నింపుతుంది. రెక్కలు ముక్కలు చేసుకుని మనల్ని పెంచి పెద్ద చేస్తుంది. బుడిబుడి అడుగుల నుంచే నడతను, ఆ తర్వాత భవితను నిర్దేశిస్తుంది. ఏ చిన్న తప్పుచేసినా కడుపులో దాచుకుని, కనికరిస్తుంది. కొడుకులు చెట్టంత ఎదిగి దూర తీరాలకేగినా, బిడ్డలు అత్తవారిళ్లకు వెళ్లినా ఆ తల్లి హృదయం వారి క్షేమం కోసమే పరితపిస్తూనే ఉంటుంది. కన్నపేగుకు ఏ చిన్న కష్టమొచ్చినా తల్లడిల్లిపోతుంది. ఇలా తమ కోసం సర్వస్వం ధారపోసి, పెంచి పెద్దచేసిన తల్లులను వారి జీవిత చరమాంకంలో కళ్లల్లో పెట్టుకుని కాపాడడం ప్రతి ఒక్కరి విధ్యుక్తధర్మం. ఇదీ మాతృదినోత్సవ నేపథ్యం..

తల్లిపై ప్రేమను చూపించడానికి ప్రత్యేకమైన తేదీ, ప్రత్యేకమైన రోజు అవసరం లేదు. వారిపై ఎప్పుడూ.. ఎలా ప్రేమలు చూపించినా వారు మీకు వంద రెట్లు ప్రేమను అందిస్తారు. అయితే వారికంటూ ఓ స్పెషల్‌గా ఓ రోజును డెడికేట్ చేసి.. ప్రపంచ వ్యాప్తంగా మదర్స్ డే నిర్వహిస్తున్నారు. అసలు ఈ డేని ప్రారంభించడంవెనుక రీజన్ ఎంటి? ఈరోజు ఎందుకింత ప్రాముఖ్యత ఉందో ఇప్పుడు తెలుసుకుందాం.

ఇదీ నేపథ్యం

ప్రతి ఏటా మే రెండో ఆదివారం నిర్వహిస్తున్న ప్రపంచ మాతృదినోత్సవానికి సుదీర్ఘ చరిత్ర, నేపథ్యం ఉంది. గ్రీస్‌లో 'రియా' అనే దేవతను 'మదర్ ఆఫ్ గాడ్స్'గా భావించి ఏడాదికోసారి నివాళులర్పించేవారు. 17వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో తల్లులకు గౌరవంగా 'మదరింగ్ సండే' పేరిట ఉత్సవాన్ని జరిపారు. 'జూలియవర్డ్ హోవే' అనే మహిళ అమెరికాలో 1872లో తొలిసారిగా ప్రపంచ శాంతి కోసం మదర్స్‌డే నిర్వహించాలని ప్రతిపాదించింది. అన్న మేరీ జర్విస్ అనే మహిళ 'మదర్స్ ఫ్రెండ్‌షిప్ డే' జరిపించేందుకు చాలా కృషి చేసింది. ఆమె 1905 మే 9న మృతి చెందగా, ఆమె కుమార్తె మిస్ జెర్విస్ మాతృదినోత్సవం కోసం విస్తృతంగా ప్రచారం చేసింది. ఇలా 1911 నాటికి అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లో మాతృదినోత్సవం జరుపడం మొదలైంది. ఫలితంగా 1914 నుంచి దీన్ని అధికారికంగా నిర్వహించాలని అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ నిర్ణయించారు. కాలక్రమేణా ప్రపంచమంతా వ్యాపించింది. అప్పటి నుంచి ప్రతిఏటా మే నెల రెండో ఆదివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

అమ్మ ప్రోద్బలంతోనే అధికారినయ్యా..



రాజాపేట : అమ్మంటే నాకు ప్రాణం, అమ్మ వల్లే నేను అధికారిని అయ్యా. మా అమ్మనాన్నలు నాగమణి, సుబ్బారావులు. వారికి ఇద్దరి సంతానంలో నేను చిన్నదానిని. నన్ను అమ్మ అమ్మాయిలా కాకుండా అబ్బాయిలా పెంచింది. అన్నింటిలో అబ్బాయిలతో పోటీపడేట్లుగా చేసింది. బలంగా ఉండేందుకు చిన్నతనంలో మినపపప్పుతో కుడుములు చేసి పెట్టేది. బలమైన ఆహారాన్ని ఇస్తూ జీవితంలో ఎదిగేందుకు ఎన్నో మంచిమంచి స్ఫూర్తినిచ్చే కథలు చెప్పేది. ధైర్యాన్ని నూరిపోసేది. చిన్నప్పుడే అమ్మ ప్రోద్బలంతో కరాటే, క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకున్నా. అమ్మ చూపే ప్రేమతో నేడు చదువుకుని అధికారిని అయ్యా. మాతృమూర్తి గొప్పతనం ఎంత చెప్పినా తక్కువే. తల్లిదండ్రులే మొదటి గురువులు, దేవుళ్లు.

గొల్లపల్లి పద్మజ, మండల వ్యవసాయాధికారి, రాజాపేట

ముగ్గురు కుమార్తెలను తీర్చిదిద్దిన ఓ అరుణ కథ..



ముగ్గురు కుమార్తెలతో అరుణ

పొత్తిళ్ల బిడ్డలు ఎదుగకముందే తాళి కట్టిన భర్త కన్నుమూస్తే ఆ భారాన్ని తాను మోసి పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తల్లి కథ ఇది. ఎన్నో కష్టాలను ధైర్యంగా ఎదురీదుతూ పిల్లలభవిష్యతే ఏకైక లక్ష్యంగా సాగుతు ఉజ్వల భవిష్యత్‌ను ఆ తల్లి అందించింది. ఉద్యోగరీత్య ఆర్టీసీ కండక్టర్‌గా ప్రయాసలను ఓర్చుకుంటునే ముగ్గురు కుమార్తెల బాధ్యతలను చూస్తున్న కొరకంటి అరుణ అమ్మ కథ ఇది..

యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన కొరటికంటి అరుణ 2008లో ఒక సామాన్య గృహిణిగా ఉండేది. భర్త గుట్ట ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీగార్డ్‌గా విధులు నిర్వహిస్తూ 2009లో అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మృతితో ముగ్గురు చిన్నవయస్సులో ఉన్న ఆడపిల్లలతో కుటుంబపోషణ, పిల్లలు చదువుల బాధ్యతంతా భార్య అరుణపై పడింది. భర్త ఉద్యగం వెంటనే రాకపోవడంతో కుటుంబ పోషణ అగ్నిపరీక్షలా మారింది. ఆరేళ్ల ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. 2016లో కండక్టర్‌గా అవకాశం లభించింది. ప్రతి నిత్యం ప్రయాణికులతో ప్రయాసాలకు ఓర్చుకుంటూ, తన కష్టాలను పిల్లలకు తెలియకుండా ఓర్పుతే కుటుంబ బాధ్యత కొనసాగించింది. ఇంట్లో పిల్లల విద్యాభ్యాసానికి లక్షల్లో ఖర్చు అవుతున్నా, వేతనం తక్కువైనా తన పిల్లలకు ఎలాంటి కష్టాలు రాకుండా అన్నీ చూసుకుంటూ వారిని చదువులు చదివించింది. ముగ్గురిని బీఈడీ, బీటెక్, డిగ్రీ చదివించి ఉద్యోగులుగా తీర్చిదిద్ది, ఇద్దరి పెళ్లిళ్లు జరిపించింది. ఏ కష్టాన్ని తెలియకుండా ఉన్నతంగా తీర్చిదిద్దిన అరుణ జీవనయానం స్ఫూర్తిదాయకం.

అమ్మా నీకు వందనం!



నవ మాసాలు మోసి కంటికి రెప్పలా కాపాడుకుంటూ, నీ ఆహారం, నీ శ్వాసని నాకు పంచి రక్తమాంసాలతో రూపుదిద్దుకుంటున్న నాకు జీవం పోశావ్. అశ్రువులు పడుతూ.. ఆయాసపడుతూ నా బరువును కడుపులో మోసి, నన్ను ఈ లోకానికి తీసుకురావాలని పరితపించిన నీకు వందనం. నీ తపస్సు, నీ యజ్ఞం ఫలించి ఈ లోకానికి నేను ఆర్తనాదంతో వచ్చా. నీ కోసం ఏడిస్తే, నీ కష్టాన్ని మరిచిపోయి నీవు కురిపించిన మమకారం దేనికీ సాటి రాదు. నాకు తెలిసిన అరుపు అరిస్తే, ఆ మమకార బంధం ఎక్కడ ఉన్నా ఏ స్థితిలో ఉన్నా, పరిగెత్తుకుంటూ వచ్చి నన్ను హత్తుకుంది. అక్కున చేర్చుకోగానే నాకు సాంత్వన చేకూరుతుంది.

ఆకలైతే అమ్మా.. కోపం వస్తే అమ్మా.. విషయం కోసం అమ్మా, విద్య కోసం అమ్మా, నా ప్రతీ అడుగులో నీ నీడ. నా ఎదుగుదలలో నీ భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంది. ఈ రోజు నేను ఏదో అది నువ్వే, నీ కుల ప్రతి రూపమే నేను. నేను విసుక్కుంటే అర్థం చేసుకుంటావు. నేను కోప్పడితే చిరుదరహాసం చూపుతావు. నీ సహనం నాకు స్ఫూర్తి. ప్రతిఫలం ఆశించని నీ ప్రేమకు ఏమిచ్చి నేను రుణం తీర్చుకోగలను? అమ్మా.. నీకు వందనం.

నేను పుట్టినప్పటి నుంచి నీతో పంచుకున్న బాధలు, కష్టాలు, సుఖాలు అన్నింటికి నీ సమాధానం నా శ్రేయస్సు. అమ్మ అంటే ఒక నమ్మకం. అమ్మా అంటే ఒక అనుభూతి. అమ్మా అంటే ఆనందం. నిన్ను తలచుకోవడానికి ఒక రోజు చాలదు. ప్రతీ క్షణం నీ భిక్ష. అమ్మదనపు కమ్మదనం ఆరగించే అమ్మ దినోత్సవ రోజు అందుకో నా వందనం.

నీ ప్రియాతిప్రియ కుమారుడు,
ముత్యాల మహిపాల్‌రెడ్డి, దేశ్‌ముఖి గ్రామం,
యాదాద్రి-భువనగిరి జిల్లా - 508284.


● అమ్మ వల్లే సమాజ సేవలో



గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తల్లి సావిత్రమ్మ

మా అమ్మ సావిత్రమ్మ నా చిన్నతనం నుంచే సమాజానికి సేవ చేయడం నేర్పించింది. చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో ఎవరికైనా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ లేక పోతే డబ్బులు పెట్టి కొనిఇచ్చేది. ఎదుటివారితో స్నేహం చేయడం ఆమె ద్వారా నేర్చుకున్నాం. నేను విజయవాడలో చదువుకునే రోజుల్లో సెలవుల్లో ఇంటికి వచ్చిన తర్వాత బంధువుల గ్రామం వెళ్లా. విజయవాడ నుంచి మా స్నేహితులు కొంతమంది నాకోసం మా గ్రామానికి వస్తే వారికి నేను లేకున్నా వస్తాడని నమ్మించి వారిని రెండు రోజులు దగ్గరుంచుకుని ఇష్టమైన వంటలు చేసి పెట్టింది. మా అమ్మకు 70ఏళ్ల వయస్సులో కూడా ఎప్పుడో 40ఏళ్ల క్రితం సంబంధం లేకుండాపోయిన తన స్నేహితురాలి సమాచారం వెతికి మరీ తెలుసుకుని ఆమె వద్దకు వెళ్లివచ్చింది. అమ్మ ద్వారా చాలా విషయాలు నేర్చుకుని నేడు వాటిని పాటిస్తున్నా.

గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే.



ఆర్మీలోకి వెళ్లేలా కుమారుడిని తీర్చిదిద్దిన తల్లి

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

భర్త కోరికను కుమారుడి ద్వారా నెరవేర్చి ఓ తల్లి సంతోషపడింది. ఇది ఓ యుద్ధవీరుడి తల్లి స్ఫూర్తినింపే జ్ఞాపకం. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన బిక్కుమళ్ళ మంజుల భర్త ఉపేందర్‌కు చిన్నప్పటి నుంచి ఆర్మీలో సేవ చేయాలనే తపనఉండేది. అనుకోనికారణంగా ఆయన ఆర్మీలోకి వెళ్లలేకపోయాడు. మంజుల, ఉపేందర్‌కు కుమారుడు సంతోష్ జన్మించాడు. దీంతో భర్త కోరికను తీర్చేలా కుమారుడిని ఆర్మీలోకి వెళ్లేలా తీర్చిదిద్దింది. కల్నల్‌గా దేశానికి సేవలు చేసిన సంతోష్ బాబు దేశం కోసం ప్రాణాలను వదిలాడు. దేశమంతా కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. తాను కుంగిపోయినా అదేసమయంలో భర్త కోసం, కోడలు, మనవడు, మనవరాలి కోసం ధైర్యంగా నిలబడి వారికి ధైర్యాన్ని ఇచ్చింది మంజుల. ఆమె ధైర్యం అనితర సాధ్యం.

గర్వపడేలా చేశాడు



నా కుమారుడు సంతోష్ నేను, నా ప్రాంతం, నా దేశం గర్వపడేలా చేశాడు. పిల్లల ఇష్టాలను తెలుసుకొని ఆ దిశగా ముందుకుపోయేలా ప్రోత్సహించాలి. చావు ఎప్పుడైనా వస్తుంది. చావు 10 మందికి ఉపయోగపడేలా ఉండాలని నేను నమ్మిన సిద్ధాంతాన్ని నా కుమారుడు చేసి చూపించాడు. యువత సంతోష్‌బాబును ఆదర్శంగా తీసుకొని ఆర్మీలోకి వెళ్లాలి.

బిక్కుమళ్ళ మంజుల(కల్నల్ సంతోష్‌కుమార్ తల్లి)

అమ్మ మాటగా సివిల్ సాధన

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)



తల్లి రేణుకతో ఖుషిల్‌వంశీ

ప్రజల కోసం ఏదైనా చేయాలని...ప్రజల సమస్యలను తీర్చేలా ఎదగాలని తల్లి చెప్పిన మాటలను నెలబెట్టుకున్నాడు ఒక కుమారుడు. తల్లి మార్గం వేరు, కుమారుడి మార్గం వేరు. అయితే తిరిగి వారి ఇద్దరి లక్ష్యం మాత్రం ఒకటిగా మారింది. ఇది ఒక తల్లీకుమారుల జీవన శైలి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నివసించే కొత్తపల్లి రేణుక పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శిగా నిత్యం ప్రజల సమస్యలను ముఖ్యంగా మహిళా సమస్యలపై పోరాటం చేస్తోంది. భర్త శివకుమార్ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అయితే భర్త అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల సమస్యలపై పోరాడుతోంది. అదేవిధంగా ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు ఖుషిల్‌వంశీ చదువుల్లో రాణించి ప్రజల సేవ చేసేలా, ప్రజల సమస్యలను పరిష్కరించేలా అధికారి కావాలని ధృడంగా నమ్మింది. ఆ దిశగా కుమారుడిని ప్రోత్సహించింది.

నాలుగు ఉద్యోగాలు కాదని సివిల్స్‌కు

ఖుషిల్‌వంశీకి నాలుగు ఉద్యోగాలు రాగా అవి కాదని సివిల్ ఉద్యోగం లక్ష్యంగా ఎంచుకున్నాడు. ముఖ్యంగా తల్లి కోరికను తీర్చేలా సివిల్స్ సాధించాడు. మొదటగా ఇన్‌కంటాక్స్, మిలటరీలో, ఎస్‌ఐగా, అసిస్టెంట్ కమెండర్‌గా ఉద్యోగాలకు ఎంపికైనా తల్లి చెప్పిన మాటప్రకారం ప్రజలకు సేవ చేయాలని సివిల్స్ ప్రతిభ చాటి అదనపుకలెక్టర్‌గా ఎంపికయ్యాడు. త్వరలో శిక్షణకు వెళ్లనున్నాడు.

ఏది చేసినా ప్రజలకు ఉపయోగపడాలి

ఏది చేసిన అది కచ్చితంగా ప్రజలకు ఉపయోడపడాలని నేను నమ్ముతాను. అదే విధంగా నా కుమారుడి అదే చెప్పడం జరిగింది. నేను ప్రజల కోసం, వారి సమస్యల కోసం ప్రత్యక్ష పోరాటాం చేస్తుండగా నా కుమారుడు ప్రజల సమస్యల పరిష్కరించేలా అదికారిగా ఉండడం గొప్ప విషయం. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలన్నదే తల్లిగా నాకోరిక.

- కొత్తపల్లి రేణుక



అమ్మ విగ్రహానికి నిత్యారాధన

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

అమ్మపై ప్రేమతో ఆమె మరణించినా.. ఆమె జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.. ఇంట్లోనే ఆమె విగ్రహాన్ని ప్రతిష్టించి నిత్యం ఆరాధిస్తున్నారు యాదాద్రిభువనగిరి జిల్లా దేశ్‌ముఖి గ్రామానికి చెందిన ముత్యాల మహిపాల్‌రెడ్డి. పోలీస్‌పటేల్‌గా పనిచేస్తున్న దేశ్‌ముఖ్ గ్రామానికి చెందిన ముత్యాల సత్తిరెడ్డి భార్య ధనలక్ష్మమ్మలది రైతు కుటుంబం. వీరికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమారుడు జైపాల్‌రెడ్డి సివిల్ కాంట్రాక్టర్, రెండో కుమారుడు మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్. చిన్నకుమారుడు రాంపాల్‌రెడ్డి ఆస్ట్రేలియాలో నివాసముంటున్నాడు. అతడు లిబరల్ పార్టీ ఆఫ్ ఆస్ట్రేలియా కోశాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉన్నత ఉద్యోగం చేస్తున్నాడు. వీరి తండ్రి వ్యవసాయ పనులు చేసుకోగా తల్లి ధనలక్ష్మమ్మ వీరి చదువులకు, ఉన్నత ఉద్యోగాలు పొందేందుకు కష్టపడింది. తన ఆరుగురు సంతానాన్ని అపురూపంగా పెంచుకుంది. 82వ యేట 2024 జూలైలో మృతి చెందారు. ఆమెపై ప్రేమతో ఆమెను నిత్యం ఆరాధించేందుకు మహిపాల్‌రెడ్డి సొంత ఊరు దేశ్‌ముఖిలోని స్వగృహంలో ధనలక్ష్మమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి నిత్యం ఆరాధిస్తున్నాడు. తన తల్లి తమ ఉన్నతికి పాటు పడిన ఆమెను నిత్యం స్మరించుకుంటున్నాడు. .



దేశ రక్షణకు సైనికుల సేవలు వెలకట్టలేనివి



జవాన్ల తల్లిదండ్రులకు పాద పూజ చేసి సన్మానిస్తున్న జనగణ మన ఉత్సవ సమితి సభ్యులు

త్రిపురారం, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకు సైనికుల సేవలు వెలకట్టలేనిదని జనగణమన ఉత్సవ సమితి సభ్యులు అన్నారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో ఆధ్వర్యంలో శనివారం జనగణమన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జవాన్ల తల్లిదండ్రులకు పూలతో పాద పూజ చేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జన్మనిచ్చిన దేశం కోసం కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ దేశ సరిహద్దుల్లో కాపలా కాయడం గొప్ప విషయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సైన్యంలో చేర్పించడం గర్వించదగిన విషయమన్నారు. ఇండియా-పాకిస్థాన్‌కు యుద్ధ సమయంలో సైనిక కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు. గ్రామమంతా ఆయా కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. అనంతరం జాతీయగీతాలాపన చేశారు. కార్యక్రమంలో త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాసరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు నగరి వెంకన్న, అనుముల అంజయ్య, దస్తగిరి, కటకం మల్లికార్జున్, రాపర్తి శ్రీనివాస్, వెంకన్న, గిరి, తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి వలస కార్మికుడు మృతి

చౌటుప్పల్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం తాగి వలస కార్మికుడు మృతి చెందాడు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిసా రాష్ట్రానికి చెందిన సరోజ్‌కుమార్(43) మండలంలోని దండుమల్కాపురం శివారులో నివాసముంటూ సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. మద్యం తాగే అలవాటున్న కుమార్ శుక్రవారం అతిగా మద్యం తాగి రూమ్‌లో పడుకున్నాడు. శనివారం అతడి స్నేహితులు రూమ్ వద్దకు వెళ్లగా మృతి చెంది కనిపించాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతిగా మద్యం తాగడం వల్లనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో మరో కార్మికుడు..

చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం శివారులోని పరిశ్రమ క్వార్టర్స్‌లో వలస కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఒడిసా రాష్ట్రానికి చెందిన సురేశ్ బహదూర్(64) స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామునశ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సురేశ్ బహదూర్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బహదూర్ గుండెపోటుతో మృతి చెందినట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

దామరచర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ గ్రామశివారులో జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం గూడూరు క్యాంప్ పరిధిలోని బోట్యానాయక్‌తండాకు చెందిన బానోతు హనుమంతు(45) పనినిమిత్తం దామరచర్ల మండలం కల్లెపల్లికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ క్రమంలో తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా హనుమంతుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి):తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని మూడు నెలలుగా నల్లగొండ జిల్లా కేంద్రంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 22 తులాల బంగారు ఆభరణాలు, రెండు కటింగ్ మిషన్లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్‌కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ నిందితుడి వివరాలను వెల్లడించారు. నల్లగొండ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పాలడుగు నరేష్ వృతిరీత్యా మేస్త్రీ. చిన్నతనం నుంచే దొంగతనాలకు అలవాటు పడి వ్యసనాలకు బానిసై గతంలో నాలుగు కేసులలో జైలుకు వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో బాగా అప్పులు కావడంతో తిరిగి తన ప్రవృత్తిని మార్చుకోకుండా దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని పట్టపగలు చోరీలకు పాల్పడుతున్నాడు. ముందుగా తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి తలుపులకు ఉన్న హ్యాండిల్‌ను కట్టర్ సహాయంతో కట్‌చేసి ఇంట్లోకి వెళ్లి ఆభరణాలను చోరీ చేసేవాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆధారాలు లభించకుండా గ్లౌస్ ధరించేవాడు. ఈవిధంగా మూడు నెలల్లో అతడు చేసిన చోరీలతో వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8, టూటౌన్ పోలీస్‌స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఒక్కో కేసు నమోదైంది. దీంతో వరస దొంగతనాలను సీరియస్‌గా తీసుకున్న జిల్లా పోలీస్ యంత్రాంగం డీఎస్పీ కే శివరాంరెడ్డి పర్యవేక్షణలో మూడు ప్రత్యేక బృందాలుగా వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్‌ఐలతో కూడిన బృందాన్ని విచారణకు ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పట్టణంలోని పాతబస్తీలో ఓ బంగారు ఆభరణాల దుకాణం వద్ద అనుమానస్పదంగా బంగారు ఆభరణాలు విక్రయించడానికి ఓ వ్యక్తి రావడంతో నమ్మదగిన సమాచారంతో అతడిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నేరం అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించగంలో ప్రతిభ కనబర్చిన డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు సైదులు, సందీప్, గోపాల్‌రావు, సిబ్బంది వెంకన్న, వెంకట్‌నారాయణ, రబ్బానీ, లింగారెడ్డి, షకీల్, శ్రీకాంత్, సైదులు, కృష్ణ, అంజద్‌లను ఎస్పీ అభినందించారు.

విధుల నుంచి తొలగించారని పారిపోయిన వీవోఏ

● నాయకులు వేధిస్తున్నారని ప్రభుత్వ విప్‌కు వీవోఏల ఫిర్యాదు



మిట్టపల్లి సంధ్య

యాదగిరిగుట్ట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : వీవోఏగా విధుల నుంచి అన్యాయంగా తొలగించారని, అవమానం భరించలేక వీవోఏ ఇంటి నుంచి పారిపోయింది. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఈ సంఘటన జరిగింది. వీవోఏల సంఘం జిల్లా, మండల అధ్యక్షులు అనురాధ, సునీత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామానికి మిట్ట సంధ్య 12 ఏళ్లగా గ్రామ సంఘం సహాయకురాలు(వీవోఏ)గా విధులు నిర్వహిస్తోంది. అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు, కొంతమంది మహిళలు మూడు నెలల నుంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇటీవల సంఘ సభ్యులతో దురుసుగా ప్రవరిస్తుందని, లేనిపోని ఆరోపణతో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 9న అధికారులు ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా సంధ్యను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. దీంతో తాను ఎలాంటి తప్పు చేయకున్నా తనను ఇబ్బందులకు గురిచేసి అన్యాయం తొలగించారని గ్రామానికి చెందిన కొందరు నాయకులు, మహిళల పేర్లతో కూడిన ఉత్తరం రాసి సెల్‌ఫోన్ ఇంట్లోనే పెట్టి బైక్‌పై తెల్లవారుజామున ఉదయం 4గంటలకు ఇల్లు విడిచి వెళ్లిందన్నారు. ఆమె ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కేసు నమోదు

వీవోఏ సంధ్య గ్రామంలో కొందరు వేధింపులకు గురిచేసి విధుల నుంచి తొలగించారని అవమానం భరించలేక ఇంటి నుంచి పారిపోయిందని, అందుకు బాధ్యులైన వారిపై చర్య తీసుకోవాలని సంధ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బొడ్డుపల్లి భాస్కర్ తెలిపారు. ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టామని, ఇంతవరకూ ఆచూకీ లభించలేదన్నారు.

మాకు రక్షణ కల్పించండి

ఎలాంటి తప్పులు చేయకున్నా గ్రామంలో కొంతమంది నాయకుల వీవోఏపై తప్పుడు ఫిర్యాదులు చేసి తొలగించేలా చేస్తున్నారని, దీంతోనే సంధ్య పారిపోయిందని, తమకు రక్షణ కల్పించాలని వీవోఏలు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఎదుట కంటనీరు పెట్టారు. వీవోఏలపై రాజకీయ ఒత్తిళ్ల వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన చెందారు. స్పందించిన విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ సంధ్య ఆచూకీ తెలుసుకోవాలని సీఐని ఆదేశించారు. వీవోఏలకు రక్షణ కల్పిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వీవోఏలు నంద సునీతా, వీరవెల్లి శోభ, కానుగు కవిత, భిక్షపతి, సంధ్య కుటుంబ సభ్యులు తల్లి లింగాల అండమ్మ, కుమార్తె మిట్ట హర్షిత తదితరులు పాల్గొన్నారు.

అత్తాకోడళ్ల మౌనపోరాటం

నార్కట్‌పల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): భర్తల తీరుకు నిరసనగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అత్తాకోడళ్లు శనివారం మౌనపోరాటం చేశారు. మూడు రోజులుగా వారు ఆందోళనను కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు బైఠాయించారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతూనే ఉంటామని బాధిత అత్తాకోడళ్ల కుటుంబ సభ్యులు, బంధువులు అన్నారు. మహిళా సంఘాలు, సామాజిక వాదులు తమ పోరాటానికి మద్దతు తెలపాలన్నారు. భార్యలకు అన్యాయం తలపెట్టిన భర్తలను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సీఐ భాస్కర్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బుడిగజంగాలకాలనీ సమీపంలో చెట్లపొదల్లో గుర్తు తెలియని 60ఏళ్ల వయస్సు కలిగి వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. సుమారు వారం రోజుల కిందట మృతి చెంది ఉండొచ్చని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

నల్లగొండ టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ఈ నెల 15, 16 తేదీల్లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ అవంతీపురం కళాశాలలో నిర్వహించనున్నట్లు గురుకులాల నల్లగొండ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నమో నారసింహా

● లక్ష్మీనారసింహుడికి లక్ష పుష్పార్చన
● కాళీయ మర్దనుడు, శ్రీ రామ అలంకరణలు
● సహస్రనామ పారాయణాలు, అభిషేకాలు

యాదగిరిగుట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి ప్రధానాలయం, పాతగుట్ట ఆలయంలో ఏకకాలంలో వార్షిక జయంత్యుత్సవాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఆలయంలో నిత్యారాధనల అనంతరం ప్రధానార్చకుడు నల్లంథీగళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాందూరి వెంకటాచార్యులు బృందం గర్భాలయానికి అభిముఖంగా నిత్య నరసింహమూర్తి, మూలమంత్ర హవనాలు, లక్ష్మీసూక్త, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, అభిషేకాలు, నవకలశ స్నపనం, లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన చేపట్టారు. స్వామివారిని కాళీయమర్ధన కృష్ణాలంకరణలో దివ్య మనోహరంగా అలంకరించి దివ్య ప్రబంధ పాశుర పఠనాలు, వేద పారాయణంతో తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం యాగశాలలో బింబం, కుంభం, మండలం



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

ప్రయోగాల ద్వారా చతుస్థానార్చన పూర్వకంగా నిత్య హవనాలు, సామూహిక పారాయణం, నృసింహ మూల మంత్ర హవనాలు నిర్వహించారు. స్వామివారిని శ్రీరామ అలంకరణలో హనుమంత వాహనంపై తిరువీధిలో ఊరేగించారు. అదేవిధంగా పాతగుట్ట ఆలయంలో ఉదయం నిత్య నృసింహ మూలమంత్ర హవనం, లక్ష పుష్పార్చన నిర్వహించి సాయంత్రం నృసింహ మూలమంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి చేశారు. ఈ వేడుకల్లో దేవాదాయశాఖ డైరెక్టర్, ఈవో ఎస్.వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, పర్యవేక్షకులు నాగుల మహేష్‌గౌడ్, రామరావునాయక్, మాచర్లరాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, దాసోజు నరేష్, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్ రెడ్డి, ఎస్పీఎఫ్ ఇన్స్‌పెక్టర్ కే.శేషగిరిరావు పాల్గొన్నారు.



హనుమంతవాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

కాళీయమర్ధన అలంకరణ విశిష్టత

శ్రీ కృష్ణావతారంలో గోకులంలో తన భక్తుల రక్షణార్థమై చూపిన లీలల్లో కాళీయమర్ధన అవతారం ఎంతో విశిష్టమైంది. విష జ్వాలలతో కలుషితం చేసి యమునానదిని ఆశ్రయించిన పశు, పక్ష్యాదులను నశింపజేసే కాళీయుడి గర్వాన్ని అణచి, నది నీటిని సేవించేందుకు సంరక్షించి ప్రాణులను కాపాడే ఘట్టం ఎంతో అపూర్వమైంది. భక్తులకు ఈ అవతారంతో రక్షిస్తానని తెలియపరచడమే అలంకరణ విశిష్టత.

అలంకరణ, వాహన సేవ విశిష్టత

శ్రీమన్నారాయణుడు త్రేతాయుగంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీరాముడిగా అవతరించాడు. సమస్త మానవులకు ఆదర్శపురుషుడిగా కీర్తిగడించాడు. వినయం, విజ్ఞత, ప్రభుభక్తి కలిగిన మహాశక్తి సంపున్నుడిగా వేద వేదాంగ శాస్త్ర పారంగతుడు, దాస్య భక్తికి నిలువెత్తు నిదర్శనంతో శ్రీరాముడికి తగ్గ మహాభక్తుడు హనుమంతుడు. స్వామివారిని శ్రీరామ అలంకరణలో హనుమంత వాహనారూఢుడై భక్తులకు దర్శనం కలిగించుటయే అలంకరణ విశిష్టత.

అలరించిన సంగీత సభలు



హిరణ్యాకశ్యప వధ నృత్యరూపకం

స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా రెండో రోజు ధార్మిక సాహిత్య సంగీత సభలు కొనసాగాయి. ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకు శ్రీ వీర ప్రతాప భజన మండలి (యాదగిరిగుట్ట), 6.45 నుంచి 7.30 గంటల వరకు శ్రీ భాగ్యలక్ష్మీ మహిళ భజన మండలి (యాదగిరిగుట్ట), 7.30 నుంచి 8.15 గంటల వరకు యాదాద్రి భక్త భజన సమాజం (యాదగిరిగుట్ట) భజనలు, సాయంత్రం 5 నుంచి 5.45 గంటల వరకు చిలకమర్రి సిస్టర్స్ (హైదరాబాద్) భక్తి సంగీతం, 5.45 నుంచి 6.30 గంటల వరకు మద్దాలి సౌందర్య బృందం (హైదరాబాద్), 6.30 నుంచి 7.15 గంటల వరకు కళానృత్య నికేతన్ (స్కూల్ ఆఫ్ కూచిపూడి) (బిందు, అభినయ, హైదరాబాద్), 7.15 నుంచి 8 గంటల వరకు బిందురెడ్డి, హరీష్ డాన్స్ అకాడమి (యాదగిరిగుట్ట) కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులు అలరించాయి.

నేటితో జయంత్యుత్సవాలు పరిసమాప్తి

రెండు రోజులుగా ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి నృసింహ మూలమంత్ర హవనాలు, 8.30 నుంచి 9గంటల వరకు మహాపూర్ణాహుతి, సహస్రకలశాభిషేకం, సాయంత్ర 7గంటల నుంచి విశేష తిరువారాధన, అర్చన వేద స్వస్తి, నృసింహ ఆవిర్భావం, మహానివేదన, తీర్థప్రసాద గోష్ఠితో జయంత్యుత్సవాలు పరిసమాప్తమవుతాయి. అదేవిధంగా పాతగుట్ట ఆలయంలో ఉదయం నృసింహ మూలమంత్ర హవనాలు, మహాపూర్ణాహుతి, అష్టోత్తర శత ఘటాభిషేకం సాయంత్ర నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించనున్నారు. బచ్చన్నపేట మండలం దబ్బకుంటపల్లి ఆలయంలో ఉదయం 8.30 గంటలకు స్వస్తివాచనం, విశ్వక్సేన పూజ, అభిషేకాలు, 10.30 గంటలకు స్వామివారి కల్యాణం, మహానివేదన, తీర్థప్రసాద గోష్ఠి, ఆశీర్వచనంతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 33,52,544 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ డైరెక్టర్, ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.



హనుమంతవాహనంపై స్వామివారు

నేడు గిరిప్రదక్షిణ.. స్వాతి నక్షత్ర వేడుకలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రం ఎంతో మహిమాన్వితమైనదని ప్రశస్తి. ఇక్కడి యాదగిరి'పై స్వయంభువుగా వెలసిన పంచనారసింహుడి గిరిప్రదక్షిణ చేస్తే పాపాలు, దోషాలు తొలగించి ఏకశిఖరవాసుడు ముక్తిని ప్రసాదిస్తాడని భక్తుల విశ్వాసం. ప్రతీ నెలా స్వామివారి జన్మనక్షత్రం రోజున ఆలయంలో అష్టోత్తర శతఘటాభిషేకంతో స్వాతి వేడుకలు నిర్వహిస్తారు. కొన్నేళ్లుగా స్థానికులు, భక్తులు గిరిప్రదక్షిణ చేస్తుండగా గత ఏడాది దేవస్థానం వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల రాక రెట్టింపు కాగా గత నెల సుమారు 20వేల మంది భక్తులు గిరిప్రదక్షిణ చేశారు. తెల్లవారుజామున 5.30 గంటలకు వైకుంఠద్వారం చెంత ప్రారంభమై సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర 45నిమిషాల్లో ప్రదక్షిణ పూర్తి చేస్తారు. వైకుంఠద్వారం పక్కన వేదిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు, దారి పొడవున భజనలు, కోలాట నృత్యాలతో స్వామిని స్తుతిస్తూ కొండకింద కోలాహలంగా మారుతోంది. ఆదివారం జరగు గిరిదక్షిణోత్సవానికి భక్తుల సంఖ్య మరింత పెరగనుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఇందుకోసం ప్రదక్షిణ మార్గంలో విద్యుత్ దీపా లు వెలిగేందుకు చర్యలు తీసుకున్నారు. ఓబీసీ సెంట్రల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాదూరి అచ్చయ్య నేతృత్వంలో 100మంది మహిళలు, అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుంగనూరు గోమాతతో బాలక్రిష్ణ గురుస్వామి 500మంది భక్తులతో కలిసి ప్రదక్షిణలో పాల్గొననున్నారు.

మట్టపల్లి నృసింహుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మఠంపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లిశ్రీలక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో స్వామివారి తిరుకల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 7నుంచి నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు తొళ్లక్కంతో ప్రారంభమై, అధ్యయనోత్సవం, పరమపదోత్సవం, త్రయాహ్నికంగా చేపట్టిన ఉత్సవాలు శనివారం నిర్వహించిన శాత్తుమరైతో వైభవంగా ముగిశాయి. అనంతరం బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరా వు, విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్ తెలిపారు. కల్యాణోత్సవాల సందర్భంగా సాయంత్రం ఆలయంలో విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, మత్స్యగ్రహణం, అంకురారోహణం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనలను పాటిస్తూ శ్రీరాజలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత మట్టపల్లి నరసింహాస్వామి కల్యాణమహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ పాలకవర్గం, అధికారులు తెలిపారు



విద్యుత్ వెలుగుల్లో మట్టపల్లి మహాక్షేత్రం

వెయ్యి ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్?



చిట్యాల మండలం వెలిమినేడు ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటైన కంపెనీ

(5వ పేజీ తరువాయి)

పార్క్ కోసం ఇప్పటికే రెవెన్యూ అధికారులు 162.28 ఎకరాల భూమిని అప్పగించారు. మరో 500 ఎకరాల భూములకు గెజిట్‌ను జారీచేశారు. ఈభూములతోపాటు పట్టాభూములను కూడా సేకరించనున్నారని తెలిసింది.

ఏడాదిలోపు పరిశ్రమల ఏర్పాటు

వెలిమినేడుతోపాటు పెద్దకాపర్తి, గుండ్రాంపల్లి గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్‌కోసం భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతంలో వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. 1000 ఎకరాల భూ ముల్లో వందలాది పరిశ్రమలు ఏర్పాటవుతాయి. చి ట్యాల మండలం పెద్దపారిశ్రామిక కారిడార్ కానుంది.

కార్మికులకు ఇంటిగ్రేటెడ్ హౌసింగ్ కాంప్లెక్స్, పాఠశాల

ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో పరిశ్రమల్లో సకల సౌకర్యాలతో కూడిన పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. వాటిలో సిబ్బంది, కార్మికులు పనిచేస్తారు. వారు నివసించేందుకు సకల సదుపాయాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ హౌసింగ్ కాంప్లెక్స్‌ను, అందులో ఇళ్లను నిర్మించనున్నారు. కార్మికులు అక్క డే ఉండేందుకు అనువుగా ఉంటుంది. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ఇతర ప్రాంతాల్లో కాకుండా పరిశ్రమలుండే చోటే ఉండేందుకు వారికి అనువుగా ఉండేలా హౌసింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. అంతేకాకుండా అందులో సిబ్బంది, కార్మికుల పిల్లలకు పాఠశాలలు కూడా నిర్మించనున్నారు.

డ్రైపోర్టుతో కూడిన ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్

వెలిమినేడు, గుండ్రాంపల్లి ప్రాంతంలో డ్రైపోర్టును నిర్మించనున్నారని నాలుగేళ్ల క్రితం ప్రచారం జరిగింది. వట్టిమర్తి రైల్వే పట్టాలను ఆనుకుని ఉన్న వట్టిమర్తి-నేరడ పరిధిలో గాదిరెడ్డిపల్లిలోనైన డ్రైపోర్టును ఏర్పాటు చేసేందుకు చర్చ వచ్చింది. ఆ ప్రస్తావన నాలుగేళ్లుగా మరుగునపడింది. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయడంతో ఇక్కడే ఈప్రాంతంలోనే డ్రైపోర్టుతో కూడిన ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లుగా సమాచారం.

భయాందోళనల్లో ప్రజలు

ఇండస్ట్రియల్ పార్క్ అంటేనే చిట్యాల మండలం వెలిమినేడుకు చెందిన రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తుంటారు. ఎందుకంటే ఇప్పటికే వెలిమినేడుతోపాటు చుట్టుపక్కల గ్రామాల పరిధిలో ఫార్మా కంపెనీలుండగా వాటివల్ల వచ్చే రసాయనాల కాలుష్యంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, భూగర్భజలాలు కలుషితమై నీరు రంగుమారిపోయిందని ప్రజలతోపాటు రైతులు కూడా ఆందోళన వ్యక్తపరుస్తుంటారు. ఫార్మా కంపెనీలు కాలుష్యాన్ని వెదజల్లే కంపెనీలు తమ గ్రామాల పరిధిలో ఉండకూడదని అధికారులకు గోడువెల్లబోసుకుంటారు. కాలుష్యకారక కంపెనీల భయమే ఇండస్ట్రియల్ పార్క్ అంటే మరోభయం ఏర్పడుతుందని వారి ఆవేదన. ఏదేని తమ ప్రాంతంలో రసాయనాలతో కూడిన కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలకు ప్ర భుత్వం అధికారులు అనుమతులివ్వొద్దని, ఇప్పటికే ఉన్న ఫార్మా కంపెనీలతో ఇబ్బందులు పడుతున్నామని ఇతర పరిశ్రమలకు అనుమతివ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.



చిట్యాల మండలం వెలిమినేడులో శివారులో ఇండస్ట్రియల్ పార్క్‌లో కంపెనీల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఉత్తర భాగం వైపు భూమి

రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంది

ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ ఆ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నది. మేమేమి చెప్పలేము. ఇప్పటికే ఆప్రాంతంలో ప్రభుత్వ భూమిని టీఎస్ఐఐసీకి అప్పగించాం. ఇండస్ట్రియల్ పార్క్‌కు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే భూసేకరణ చేపట్టి టీఎస్ఐఐకి భూములను అప్పగిస్తాం. ఆ తర్వాత భూకేటాయింపుల అనంతరం పరిశ్రమలు ఏర్పడతాయి. ప్రస్తుతానికి ఎలాంటి సర్వేలు, భూసేకరణ ఏర్పాట్లు లేవు.

-యారాల అశోక్‌రెడ్డి, ఆర్డీవో నల్లగొండ

భూములిచ్చి మేము రోడ్డున పడాలా



పరిశ్రమలు వస్తున్నాయని వాటికి భూములు ఇవ్వాలంటే మాకు ఉన్న భూములను ఇచ్చి కుటుంబంతో మేము రోడ్డున పడాలా. ఉన్న భూమిని చూసుకుంటూ జీవిస్తున్నాం. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకున్న భూమిని ఇప్పుడు పరిశ్రమలకిచ్చి ఎక్కడికి వెళ్లాలి. మేమైతే భూములివ్వం. ఉన్న పరిశ్రమలతోనే ఆరోగ్యం దెబ్బతింటుంది. మళ్లీ కొత్తగా ఈ పరిశ్రమలు వస్తే జీవించేది ఎట్లా. మా భూములు తీసుకుని పొట్టకొట్టొద్దు.

-మంకాల లింగయ్య, వెలిమినేడు

పరిశ్రమలకు మాభూములివ్వం



ఇప్పటికే మా ప్రాంతంలో ఉన్న రసాయన పరిశ్రమలతో ఇబ్బందులు పడుతున్నాం. ఇక కొత్త పరిశ్రమలు రావొద్దు. ఉన్న పరిశ్రమలతోనే అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మళ్లీ కొత్త పరిశ్రమలంటే భయమేస్తుంది. పరిశ్రమలకు మాభూములను ఇవ్వం. ఉన్న భూములిచ్చి మేమేం చేయాలి. ఇక్కడ కాకుండా పరిశ్రమలను మరో చోట దూరంగా పెట్టుకోవాలి.

-అరూరి జానయ్య, వెలిమినేడు

జనావాసాల ప్రాంతాల్లో పరిశ్రమలు వద్దు



జనావాసాలున్న ప్రాంతాల్లో పరిశ్రమలు ఉండొద్దు. వాటికి ప్రభుత్వాలు అనుమతులివ్వొద్దు. పరిశ్రమలు పెట్టి స్థానికులకు ఉపాధి అంటూ మోసగిస్తారు. ఆ తర్వాత స్థానికులను కాదని ఇతర ప్రాంతాల వారిని ఉద్యోగాల్లో నియమిస్తారు. అంతేకాకుండా పరిశ్రమల నుంచి వెదజల్లే కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారు. కాలుష్యకారక పరిశ్రమలు జనావాసాల ప్రాంతాల్లో కాకుండా అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లయితే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది.

-అరూరి శ్రీశైలం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు, వెలిమినేడు

బుద్ధవనం సిద్ధం

(5వ పేజీ తరువాయి)


ఏసీ బస్సులో బయలుదేరుతారు.

- అవసరాన్ని బట్టి చింతపల్లి సమీపంలో వెంకటంపేట స్టేజీ వద్ద ఉన్న వెల్లంకి అతిథి గృహం వద్ద 15 నిమిషాలు ఆగుతారు.
- సాయంత్రం 4.30 గంటలకు సాగర్ విజయవిహార్ అతిథి గృహానికి చేరుకొని వారికి కేటాయించిన గదుల్లో కాసేపు విశ్రాంతి తీసుకోని ఆ తర్వాత ముస్తాబవుతారు.



బుద్ధవనంలో ఏర్పాటు చేయడానికి తీసుకు వచ్చిన లైట్లు

- ఈవెంట్ మేనేజర్ సూచనల మేరకు విజయవిహార్ ముందు, వెనుకవైపు ప్రాంతంలో గ్రూప్ ఫొటోలు దిగుతారు.
- అక్కడి నుంచి బస్సులో సాయంత్రం 5.30 గంటలకు బుద్ధవనానికి చేరుకుంటారు.
- బుద్ధవనానికి చేరుకున్న వారికి 100 అడుగుల దూరం నుంచే తెలంగాణ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలుకుతారు.
- బుద్ధుడి పాదాల వద్ద అందగత్తెలు పుష్పాంజలి ఘటిస్తారు.
- బుద్ధుడి పాదాల వద్ద నుంచి మహాస్తూపం వద్దకు చేరుకొని అక్కడ గ్రూప్ ఫొటో దిగుతారు.
- మహాస్తూపంపై ఉన్న విగ్రహాల గురించి వారికి ప్రముఖ బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వివరిస్తారు.
- మహాస్తూపం లోపల బుద్ధపూర్ణిమ సందర్భంగా అష్టబుద్ధుల వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తారు.
- మహాస్తూపం లోపల మూడు నిమిషాలు ధ్యానం చేస్తారు.
- ధ్యానం అనంతరం 30 మంది మాంక్‌లతో మాట్లాడి బుద్ధజయంతి గురించి వారు తెలుసుకుంటారు.
- అక్కడ నుంచి జాతకవనానికి చేరుకొని ఎవరికి కేటాయించిన సీట్లల్లో వారు ఆసీనులవుతారు.



నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం

- జాతకవనంలో బుద్ధ చరిత్ర, తెలంగాణ బుద్ధిజం, బౌద్ధ విశేషాలను గురించి తెలుసుకుంటారు. అక్కడే బుద్ధచరిత్రపై డ్రామను వీక్షిస్తారు.
- అనంతరం అక్కడ రాత్రి భోజనం చేసి తిరిగి 8గంటల సమయంలో హైదరాబాద్‌కు బయల్దేరుతారు.
- రాత్రి భోజనం ఆయా దేశాల సంప్రదాయ వంటకాలను హైదరాబాద్ నుంచే తీసుకువస్తున్నట్లు సమాచారం.

జవాన్ మురళీనాయక్ త్యాగం మరువలేనిది

శాలిగౌరారం, మే 10 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో భారత్ - పాక్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీరమరణం చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు జవాన్ మురళీ నాయక్ త్యాగం మరువలేనిదని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు తోట వినోద్‌కుమార్ అన్నారు. 25ఏళ్ల వయస్సులోనే మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్ త్యాగం ఎప్పటికి మరవబోమన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మునుగోడురూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమస్థాన్‌పల్లి గ్రామంలో అందుగుల చిన్నసాయిలు అనారోగ్యంతో మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు జాజుల స్వామిగౌడ్ ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులకు రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పంతంగి పద్మస్వామిగౌడ్, నాయకులు యాదగిరి, శంకర్, హేమంత్, ముత్యాలు, వంశీ పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ఆలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గట్టుప్పల్, మే 10(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ముత్యాలమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ దేవతల పండుగలను సంస్కృతి, సంప్రదాయాలతో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలకు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, నాయకులు రావుల రమేష్ పెద్దగోని సత్తయ్యగౌడ్, జగన్నాథం, దోరాల భరద్వాజ్ నేత, టేకుమట్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో సొడమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి



కేతేపల్లిలో జాతరకు ముస్తాబైన సొడమ్మ ఆలయం

కేతేపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం కేతేపల్లిలో యాదవుల ఆరాధ్య దైవమైన సొడమ్మ తల్లి జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రెండేళ్లకోసారి ఇక్కడ మూడు రోజుల పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీ. సోమవారం నుంచి ప్రారంభమయ్యే జాతరకై సొడమ్మ ఆలయాన్ని రంగురంగులతో అందంగా అలంకరించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

'ఉద్యోగులపై సీఎం వ్యాఖ్యలు బాధాకరం'

నల్లగొండ కల్చరల్, మే 10(ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చిన సందర్భంలో ఉద్యోగులపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నల్లగొండ తాలుకా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల పాక్ ఉగ్రవాదులు 26 మంది భారతీయులను పొట్టబెట్టుకోవడం అదేవిధంగా భారత జవాన్లు వీరమరణం పొందడం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన 5 డీఏలను వెంటనే విడుదల చేసి, పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం 30 మంది పెన్షనర్ల జన్మదిన వేడుకలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జెల్లా శ్రీశైలం, రంగయ్య, ఆంజనేయులు, సుధాకర్, పుల్లయ్య, శేషారెడ్డి, రమేష్, కేశవాచారి, జడల సువర్ణ, గంట వెంకటయ్య, గోపాల్ రెడ్డి, బాలరాజు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో కలిసిమెలిసి ఉండాలి

మునుగోడు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): దేవుని దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో కలిసి మెలసి ఉండాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మునుగోడు మండలం కోతులారం గ్రామంలో శనివారం పార్వతీ కేదారేశ్వరస్వామి దేవాలయంతో పాటు బీరప్ప దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకల శ్యామ్ కురుమ కలిసి ఎమ్మెల్సీ సత్యాన్ని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గురిజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, చాపల శ్రీను, బొల్గూరి నర్సింహ, లింగయ్య పాల్గొన్నారు.


అగ్నివీర్ మురళీకి ఘన నివాళి



కనగల్‌లో మురళీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

కనగల్, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన అగ్నివీర్ మురళీనాయక్‌కు ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం కనగల్ ఎక్స్‌రోడ్డులో ఘనంగా నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఎస్ఐ విష్ణుమూర్తి మురళీ నాయక్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఏబీవీపీ నాయకులు మురళీనాయక్ అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుడు మురళీనాయక్ అని అభివర్ణించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో మురళీనాయక్ శత్రువులతో పోరాడి వీరమరణం చెందాడని తెలిపారు. దేశం గొప్ప సైనికుడిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ, బీజేపీ నాయకులు కట్ట హరిబాబు, పంతంగి సైదులుగౌడ్, కట్ట రాంకుమార్, శేఖర్, రవి పీసీలు రమేష్‌నాయక్, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న అనూప్‌రెడ్డి

కనగల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంచంద్రాపురం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనూప్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరమని అన్నారు. అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో దరఖాస్తు చేసుకున్న ప్రతీ కుటుంబానికి చెక్కులను మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు కూసుకుంట్ల రాజారెడ్డి, మాజీ సర్పంచులు పద్మ, నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి, నాయకులు కొప్పుల యాదగిరిరెడ్డి, మాదవరెడ్డి, బాలరాజు, లక్ష్మయ్య, సురేష్, సైదులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్రికెట్ పాఠాలు

● ఉత్సాహంగా శిక్షణ శిబిరాలు
● బ్యాట్, బాల్స్‌తో కుస్తీ పడుతున్న చిన్నారులు
● ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు



బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

నల్లగొండ స్పోర్ట్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు రావడంతో క్రీడా మైదానాలు విద్యార్థులతో కిక్కిరిసిపోతున్నాయి. ఉదయం సాయంత్రం సమయాల్లో విద్యార్థులు బ్యాట్, బాల్‌తో కుస్తీ పడుతున్నారు. నిపుణుల వద్ద శిక్షణలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా నల్లగొండ క్రికెటర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ట్రైనర్ అమీనుద్దీన్ బాబా క్రికెట్ క్రీడలో బౌలింగ్, బ్యాటింగ్‌పై బాలురకు మెళకువలను నేర్పిస్తున్నారు. నల్లగొండ క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో గత 15సంవత్సరాల నుంచి ఉచిత వేసవి క్రికెట్ శిబిరాలను నిర్వహిస్తూ ఎందరో విద్యార్థులకు క్రికెట్‌ను నేర్పిస్తూ, పలు స్థాయిలోకి ఎదిగే విధంగా తయారుచేస్తున్నారు.



బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

నేర్చుకుందాం...

ఈ విధమైన బౌలింగ్ వేసేటప్పుడైనా బౌలర్ ఎంత లెంగ్త్ (దూరం) తీసుకున్నాడనేది కూడా ముఖ్యం. ఫాస్ట్ బౌలింగ్ చేసేవారు ఎక్కువ దూరం తీసుకొని వేగంగా వచ్చి బంతి విసరటం వల్ల ఎక్కువ వేగంగా బౌలింగ్ పడే అవకాశం ఉంది. స్పిన్ బౌలింగ్‌లో మాత్రం లెంగ్త్ తక్కువగా తీసుకోవటం మంచిది. దీనివల్ల బంతిని ఎక్కువ స్పిన్ చేయటమే కాక అనుకున్న చోట బంతిని వేయడానికి అనుకూలం.

లెగ్ స్పిన్...

లెగ్ స్పిన్ వేసేటప్పుడు బంతిని అన్ని వేళ్లతో పట్టుకోవాలి. స్పిన్‌లో మణికట్టు ఎక్కువగా ఉంటుంది. లెగ్ స్పిన్ వేసేటప్పుడు మణికట్టును లోపలి వైపునకు తిప్పుతూ విసరాలి. స్పిన్ బౌలింగ్ చేసేటప్పుడు అదే రీతిలో శరీరాన్ని కొంత మేర తిరగటం వల్ల స్పిన్ ఎక్కువ కావడానికి అవకాశం ఉంది.

ఆఫ్ స్పిన్...

ఆఫ్ స్పిన్‌లో కూడా బంతిని అన్ని వేళలో పట్టుకొని విసరటం జరుగుతుంది. వేళ్ల మధ్య బంతిని ఎంత బాగా తిప్పగలిగితే అంత ఎక్కువగా బంతి స్పిన్ అవుతుంది. ఈ స్పిన్‌ల్లోనైనా బంతి ఏ మేరకు తిరుగుతుందనే దానినిబట్టి వికెట్‌కు ఎంత దూరంలో, ఎక్కడ వేయాలన్నది ఆధారపడి ఉంటుంది. ఆఫ్ స్పిన్ వేసేటప్పుడు మణికట్టు బయట వైపునకు తిప్పుతూ బంతిని విసరటం జరుగుతుంది.

ఫాస్ట్ బౌలింగ్...

ఫాస్ట్ బౌలింగ్ చేసేటప్పుడు బంతి పైన ఉన్న గ్రీప్‌పై చూపుడు, మధ్య వేళ్లతో నొక్కి పట్టుకుని బౌలింగ్ చేస్తే ఎక్కువ వేగంగా వేయవచ్చు. ఫాస్ట్ బౌలింగ్ చేసేటప్పుడు చేతులను నిటారుగా విసరటం వల్ల బంతి అనుకున్నచోట పడుతుంది. ఎత్తు ఎక్కువగా ఉన్న వారు ఫాస్ట్ బౌలింగ్‌లో మంచిగా రాణించగలరు.



ఫాస్ట్ బౌలింగ్ వేస్తున్న విద్యార్థి

మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



పీహెచ్‌సీ భవన నిర్మాణ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

గట్టుప్పల్, మే 10(ఆంధ్రజ్యోతి): గట్టుప్పల్ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గట్టుప్పల్ మండలకేంద్రంలో రూ. 1.30కోట్లతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు, రూ. 25లక్షలతో నిర్మించిన గ్రంథాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు హర్షిస్తున్నట్లు తెలిపారు.

నూతనంగా ఏర్పడిన గట్టుప్పల్ మండలానికి అన్ని మౌలిక వసతులు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. త్వరలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు సైతం పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామన్నారు. మండల ప్రజలకు ఇకపై ఇక్కడి నుంచే వైద్యారోగ్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో శ్రీదేవి, పంచాయతీరాజ్ డీఈ నాగేశ్వర్‌రావు, ఎంపీడీవో మాధవరెడ్డి, తహసీల్దార్ రాములు, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, నాయకులు రావుల రమేష్, పెద్దగోని ముత్యాలుగౌడ్, జగన్నాథం, మేకల ప్రమోద్‌రెడ్డి, పాల్వాయి జితేందర్‌రెడ్డి, అన్వర్, శ్రీరాములు, దోర్నాల భర్వాజ్ నేత, చెరుపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ వాతావరణం కల్పించాలి

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నల్లగొండ టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ వాతావరణం కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్సీ తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో టీఎస్ యూటీఎఫ్, తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కమ్యూనికేషన్ ఇంగ్లీష్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2021-22 విద్యా సంవత్సరం నుంచి ఆంగ్లమాధ్యమం ప్రారంభించారు. కానీ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం పరిస్థితులు కనిపించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారని తెలిపారు. దీనిని అధిగమించటానికి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆంగ్లంలో సులభంగా మాట్లాడడం, బోధించడానికి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీని అభినందించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ బోధకులు బి.కె.రెడ్డి మాట్లాడుతూ యంఎస్‌సీ (మైండ్ టాక్, సెల్ఫ్‌టాక్, క్రాస్ టాక్) పద్ధతి ద్వారా ఇంగ్లీష్ బాషలో సులభంగా మాట్లాడవచ్చని అన్నారు. బాషను మైండ్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఇంగ్లీష్ బాషపై పట్టు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, ఉపాధ్యక్షుడు నర్రా శేఖర్‌రెడ్డి, పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు పాల్వాయి అంజిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రెడ్ల సైదులు, కార్యదర్శులు గేర నర్సింహ, రమాదేవి, నలపరాజు వెంకన్న, మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి కోసం భగీరథ యత్నం

● నాలుగు కిలోమీటర్లకు పైగా పైప్‌లైన్ ● రూ. 20లక్షలకు పైగా ఖర్చు ●





సత్తిరెడ్డి సాగు చేస్తున్న టమాటా, పైప్‌లైన్‌లో వస్తున్న నీళ్లతో నిండుతున్న ఫాంపాండ్

చిట్యాల, మే 10(ఆంధ్రజ్యోతి): కరువు ఛాయలు.. నీటి లభ్యత లేదు.. అయినా సాగు చేయాలి ఎలా అని తర్జన భర్జన పడిన రైతు నీటి కోసం భగీరథ ప్రయత్నమే చేశాడు. ఎలాగైనా సాగు చేయాలని గట్టిగా సంకల్పించుకుని ఏకంగా నాలుగు కిలోమీటర్లకు పైగా పైప్‌లైన్ వేశాడు. రూ. 20లక్షలకు పైగా ఖర్చు పెట్టాడు. మొత్తానికి అనుకున్నది సాధించాడు. చిట్యాలకు చెందిన కొంతం సత్తిరెడ్డి అనే రైతుకు ఏడు ఎకరాల భూమి లో రెండు బోర్లు వేశాడు. అందులో ఒక బోరు పూర్తి గా ఎండిపోగా మరొక బోరులో కొద్ది నీరు మాత్రమే వస్తుంది. నీటి కోసం బోర్లు వేద్దామంటే నీళ్లు పడతాయనే గ్యారంటీ లేదు. ఎందుకంటే తన పొలం చుట్టూ ఉన్న రైతులలో కొంతం యాదగిరిరెడ్డి ఆరు బోర్లు వేస్తే నీటి చుక్క పడలేదు. అలాగే పెద్దవోని లక్ష్మయ్య రెండు బోర్లు వేస్తే నీరు పడలేదు. దీంతో ఆయనకు బోర్లు వేస్తే నీరు పడదు అనవసరంగా డబ్బులు దండగ అని నిర్ణయించుకుని శాశ్వత పరిష్కారం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం మరో రైతు కనగవేలు సహాయం తీసుకున్నాడు. సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దకాపర్తి చెరువు పక్కన ఉన్న రైతు వ్యవసాయ భూమిని ఎంచుకున్నాడు. పిలాయిపల్లి కాల్వ ద్వారా చెరువు ఎప్పుడు నిండి ఉండటంతో బావిలో కూడా ఎప్పుడు నీరు ఉంటుంది. రూ. 20 లక్షల రూపాయలకు పైగా ఖర్చు పెట్టి ఆ బావి నుంచి తన పొలం వరకు నాలుగు కిలోమీటర్ల మేర ఎక్స్‌కవేటర్ సహాయంతో పైప్‌లైన్ వేశాడు. బావిలో 5 హెచ్‌పీ రెండు మోటార్లు వేసి నీరు తోడుకొస్తున్నాడు. ఆయన సంకల్పం ముందు కరువు తలవంచింది. పైప్‌లైన్ ద్వారా వస్తున్న నీటితో పాంపాండ్‌లను నింపుతున్నాడు. ఈ నీటితో సుమారు 20 ఎకరాలు సాగు చేయనున్నట్లు సత్తిరెడ్డి తెలిపారు.

నీరుంటే సిరులు పండించవచ్చు



నీరుంటే సిరులు పండించవచ్చు. గతంలో ఏడాది, రెండు, మూడేళ్ల వరకు నీటి లభ్యత ఉండేది. కానీ ఇప్పుడు ఒక ఏడాది వర్షాలు పడకపోతే నీరు లభించడం లేదు. భూగర్భజలాలను ఇష్టం వచ్చినట్లు తోడేస్తుండటంతో బోర్లు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం నీటి లభ్యతపై దృష్టి సారించాలి.

- కొంతం సత్తిరెడ్డి, చిట్యాల

టీటీడీ నిధులతో శాపల్లి ఆలయ అభివృద్ధికి కృషి

● టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి



నృసింహ జయంతి పూజలో పాల్గొన్న నన్నూరి నర్సిరెడ్డి

నార్కట్‌పల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులతో శాపల్లి కమలాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో శనివారం జరిగిన నృసింహ జయంతి ఉత్సవాల ప్రారంభ పూజలో ఆయన పాల్గొన్నారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జంగా కృష్ణమూర్తితో కలిసి ఆలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. ఆయన్ను అనువంశిక అర్చకుడు కారంపూడి నర్సింహాచార్యులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నన్నూరి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. శాపల్లి దేవస్థానం భవిష్యత్తులో ప్రాచుర్యం పొందే వైష్ణవక్షేత్రంగా బాసిల్లనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచామృతాభిషేకాల దాత అక్కెనపల్లి లక్ష్మయ్య దంపతులు, మాజీ సర్పంచ్ కర్నాటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎంపిక

కేతేపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కేతేపల్లి మండల కమిటీని శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ మాట్లాడారు. మూడు నెలల క్రితం మండల శాఖ అధ్యక్షుడిని నియమించినా పూర్తి స్థాయి కమిటీని ఎంపిక చేయలేదు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కేతేపల్లి మండల నాయకులతో సమావేశమైన జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి పూర్తిస్థాయి కమిటీని ఎంపిక చేశారు. మండల ప్రధాన కార్యదర్శులుగా కూరెళ్ల వెంకటేశ్వర్లు, ఇరుగదిండ్ల పద్మ, ఉపాధ్యక్షులు వీరబోయిన నాగయ్య, జి.కృష్ణ, ఎస్.విజయలక్ష్మి, నూకల సంధ్య నియమితులయ్యారు. అలాగే కార్యదర్శులుగా ఎల్.నరేష్, ఎలిజర్ల జనార్ధన్, ఎం.సత్యనారాయణరెడ్డి, కోశాధికారిగా తొవిటి అఖిల్‌లను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఆదేశాలు జారీ చేసినట్లు మండల అధ్యక్షుడు వెంకట్ తెలిపారు.

ప్రశాంతంగా టీఎస్‌ఆర్‌జేసీ సెట్

నల్లగొండ, మే 10(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఆర్‌జేసీ 2025 ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణ కోసం పట్టణంలో 33 పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 7,849 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 6,759మంది అభ్యర్థులు హాజరయ్యారు. 1,090 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.బిక్షపతి పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు.

పార్టీ శ్రేణులందరూ ప్రజాక్షేత్రంలో ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న దోనూరి వీరారెడ్డి

నార్కట్‌పల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టి లో ఉంచుకుని పార్టీ శ్రేణులందరూ ప్రజాక్షేత్రంలోనే ఉండాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరి వీరారెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో శనివారం నిర్వహించిన పార్టీ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 6 గ్యారంటీలు, 420 హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అనతికాలంలోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందన్నారు. ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలుపరచలేకపోయిందని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి పాకిస్థాన్ మీద ప్రేమ ఉంటే అక్కడికి వెళ్లాలని విమర్శించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు పజ్జూరి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, కొర్వి శంకర్, పాల్వాయి భాస్కర్‌రావు, లింగాల వీరయ్య, మునుకుంట్ల గణేష్, ఏర్పుల చిన్న పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండ సీపీఐ జెండా

నార్కట్‌పల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిష్టు పార్టీ (సీపీఐ) జెండా పేద ప్రజలకు అండ అని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని పల్లెపహాడ్‌లో నూతనంగా నిర్మించిన పార్టీ జెండా దిమ్మెను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో సీపీఐ పోషించిన పాత్ర మరిచిపోలేనిదన్నారు. నూతన దిమ్మెపై పార్టీ పతాకాన్ని గ్రామశాఖ కార్యదర్శి ఆలకుంట్ల నర్సింహ ఆవిష్కరించారు. అనంతరం పల్లెపహాడ్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆలకుంట్ల నర్సింహ, సహాయ కార్యదర్శులుగా దుబ్బ నర్సింహ, సిలువేరు వెంకట్‌రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, కల్మెకొలను అండమ్మ, వనం వాసు, పులుసాని అనంతరెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, దుబ్బ నర్సింహ, శిరబోయిన మల్లయ్య, చెన్నయ్య, జిల్ల దశరథ, వనం శివరాములు, శ్రీను, సారగండ్ల గణేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నమో.. నారసింహ



తిరువీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న అర్చకులు



కాళీయ మర్దనుడి అలంకరణలో స్వామివారు

- లక్ష్మీనారసింహుడికి లక్ష పుష్పార్చన
- కాళీయ మర్ధనుడు, శ్రీ రామ అలంకరణలు
- రాత్రి హనుమంత వాహనంపై ఊరేగింపు
- సహస్రనామ పారాయణం, అభిషేకాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనృరసింహుడి ప్రధానాలయం, పాతగుట్ట ఆలయంలో ఏకకాలంలో వార్షిక జయంత్యుత్సవాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఆలయంలో నిత్యారాధనల అనంతరం ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యుల బృందం గర్భాలయానికి అభిముఖంగా నిత్య నరసింహమూర్తి, మూల మంత్ర హవనాలు, లక్ష్మీ సూక్త, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణాలు, అభిషేకాలు, నవకలశ స్నపనం, లక్ష్మీనరసింహుడికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు స్వామివారిని కాళీయమర్ధన కృష్ణాలంకరణలో దివ్యమనోహరంగా అలంకరించారు. దివ్య ప్రబంద పాశుర పఠనాలు, వేద పారాయణంతో తిరువీధుల్లో ఊరేగించి సేవించారు. సాయంత్రం యాగశాలలో బింబం, కుంభం, మండలం ప్రయోగాల ద్వారా చతుస్థానార్చన పూర్వకంగా నిత్య హవనాలు, సామూహిక పారాయణం, నృరసింహ మూలమంత్ర హవనాలు నిర్వహించారు. స్వామివారిని శ్రీరామ అలంకరణలో హనుమంత వాహనంపై తిరువీధిలో ఊరేగించారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

7



బుద్ధవనం ఏరియల్ వ్యూ

ముద్దుగుమ్మల కోసం

బుద్ధవనం సిద్ధం

రేపు నాగార్జునసాగర్‌కు రానున్న ప్రపంచ అందగత్తెలు

నాగార్జునసాగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటకశాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్‌వరల్డ్-2025 పోటీలు శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాల సందర్శన ఉన్నందున బుద్ధపూర్ణిమ సందర్భంగా ఈ నెల 12వ తేదీన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనానికి ఆసియా దేశాలకు చెందిన 30 మంది మిస్‌వరల్డ్ పోటీదారులు రానున్నారు. దీంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మిస్‌వరల్డ్ పోటీదారులు విశ్రాంతి తీసుకునే విజయవిహార్ అతిథి గృహాన్ని, బుద్ధవనాన్ని అధికారులు ముస్తాబు చేశారు. బుద్ధవనంలో మహాస్తూపానికి, అలాగే అన్ని చెట్లకు, ఇతర స్తూపాలకు లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. బుద్ధవనం నుంచి విజయవిహార్ వరకు 2కిలోమీటర్ల మేర విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్లు పర్యాటకశాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే పలు మార్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, అటవీశాఖ, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి పోటీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆదివారం నుంచి బుద్ధవనం, విజయవిహార్‌ను పోలీసులు పూర్తిగా ఆధీనంలోకి తీసుకోనున్నట్లు సమాచారం.

పర్యటన ఇలా..

బుద్ధపూర్ణిమ సందర్భంగా ఈ నెల 12వ తేదీన మిస్‌వరల్డ్ పోటీదారులు నాగార్జునసాగర్ బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. వారు మధ్యాహ్నం 1 గంటలకు హైదరాబాద్ నుంచి మిగతా 7వ పేజీలో...

వెయ్యి ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్

ఇండస్ట్రియల్ పార్క్?



చిట్యాల మండలం వెలిమినేడులో శివారులో ఇండస్ట్రియల్ పార్క్‌లో కంపెనీల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న దక్షిణం వైపు భూమి, బోర్డుపాతిన టీఎస్ఐఐసీ

- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి, వెలిమినేడు, గుండ్రాంపల్లిలో ఏర్పాటుకు యోచన
- ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సూచన
- టీఎస్ఐఐసీకి 162.28 ఎకరాల భూమి అప్పగింత, మరో 500 ఎకరాలకు గెజిట్ జారీ
- భూసేకరణ అనంతరం ఏడాదిలోపు వివిధ రకాల పరిశ్రమలు
- కార్మికులకు ఇంటిగ్రేటెడ్ హౌసింగ్ కాంప్లెక్స్, ఇళ్లు, పాఠశాల
- ఇప్పటికే ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటైన ఓ కంపెనీ
- భూములిచ్చేది లేదని వ్యతిరేకిస్తున్న స్థానిక రైతులు

కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్ హంగు ఆర్భాటాలతో ఏర్పాటు కానుంది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములతోపాటు వాటి చుట్టుపక్కల గల పట్టా భూములను సేకరించి ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. అంతేనా.. అంతో ఇంతో కాకుండా 1000 ఎకరాలను సేకరించి ఇండస్ట్రియల్ పార్క్‌కు అనువుగా ఉండేలా భూసేకరణ జరుగనుంది. అందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. భూసేకరణ చేపట్టి ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి అక్కడి నుంచి జిల్లాకు ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. ఇక రానున్న రోజుల్లో చిట్యాల మండలంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కావడం ఖాయంగా కనిపిస్తుంది.

● ఆంధ్రజ్యోతి, చిట్యాలరూరల్

ఇండస్ట్రియల్ పార్క్.. ఈ మాట నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ ప్రజలకు సుపరిచితమే. ఎందుకంటే ఇక్కడ రెండు, మూడేళ్లుగా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కానుందని ప్రభుత్వానికి చెందిన పలు సర్వే నంబర్లలోని 162.28 ఎకరాల భూమిని చదునుచేసి గత ప్రభుత్వంలో టీఎస్ఐఐసీకి అప్పగించారు. ప్రభుత్వ భూమితోపాటు ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు, వాటి పక్కన ఉన్న పట్టాభూములను కూడా సేకరించి ఆ భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు గత ప్రభుత్వం హయాంలో ప్రతిపాదన వచ్చింది. 162.28 ఎకరాల భూమిని అప్పగించాక, మరో 500 ఎకరాలకు గెజిట్‌ను కూడా జారీచేశారు. దీంతో తమ భూములను ఇచ్చేది లేదని అసైన్డ్‌దారులు, పట్టాదారులు ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు చేశారు. ఆ తర్వాత ఏడాదికి పైగా ఆ విషయాన్ని మరచిపోయినట్లు స్తబ్దుగా ఉంది. అయితే ఈ ప్రాంతంలో భూమిని సేకరించి ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రభుత్వం మళ్లీ సన్నాహాలు చేస్తోంది. అందుకోసం కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. వెలిమినేడులో ఉత్తరం, దక్షిణం వైపు భాగాల్లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం ఉన్న భూములను చదును చేయడం, రాళ్లను తొలగించడంతోపాటు గుట్టల మధ్య రోడ్లు కూడా నిర్మిస్తున్నారు. వాహనాలు వెళ్లేందుకు రోడ్లను ముస్తాబుచేశారు. కంపెనీలు ఏర్పాటు చేస్తే వాటికి విద్యుత్ సౌకర్యంకోసం స్తంభాలు, వైర్లను సిద్ధం చేశారు. ఇప్పటికే వెలిమినేడు శివారులో ఉత్తరం వైపున ఓ కంపెనీ ఏర్పాటైంది. ఈ ప్రాంతం జాతీయ రహదారికి దగ్గరగా, హైదరాబాద్‌లోని విమానాశ్రయానికి చేరువలో ఉండటం, రైల్వే మార్గం, అన్ని రవాణా వసతులు ఉండటంతో భారీ ఎత్తున ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటుచేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి.

చిట్యాల మండలంలో 1000 ఎకరాల్లో భూసేకరణ

ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం చిట్యాల మండలం వెలిమినేడుతోపాటు పెద్దకాపర్తి, గుండ్రాంపల్లి గ్రామాల్లో భూములను సేకరించనున్నారు. ఆయా గ్రామాల్లో 1000 ఎకరాల్లో భూసేకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా భూసేకరణ కోసం ఐటీ, పరిశ్రమలశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్ జిల్లా అధికారులకు సూచనలు చేసినట్లుగా తెలిసింది. అయా గ్రామాల్లో 1000 ఎకరాల్లో భూసేకరణ జరిగితే ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తే, అందులో పలు రకాల కంపెనీలు స్థాపిస్తారు.

500 ఎకరాలకు గెజిట్ జారీ

వెలిమినేడు ప్రాంతంలో ప్రభుత్వ భూములున్న ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ మిగతా 7వ పేజీలో...

కదిలే దేవత అమ్మ!

● నేడు ప్రపంచ మాతృ దినోత్సవం



అమ్మను మించి దైవమున్నదా..? ఆత్మను మించి అర్థమున్నదా..? జగమే పలికే శాశ్వతమిదే.. అందరినీ కనే శక్తి అమ్మ ఒక్కతే.. అవతార పురుషుడు అయినా ఓ అమ్మకు కొడుకే..

పెదవే పలికిన మాటల్లోనే తీయని మాటే అమ్మ.. కదిలే దేవత అమ్మ.. కంటికి వెలుగు అమ్మ.. తనలో మమతే కలిపి పెడుతుంది ముద్దగా.. తన లాలిపాటలోని సరిగమ పంచుతుంది ప్రేమ మధురిమ..

అమ్మ పాడే.. జోల పాట.. అమృతానికన్నా తీయనంట..
అమ్మ పాడే.. లాలి పాట.. తేనెలూరిపారె ఏరులంట..
నిండు జాబిలి చూపించి.. ఉగ్గును పట్టి ఊయలలూపే అమ్మ లాలన..
ఊపిరి పోసి నూరేళ్ల నిండు దీవెన..

ఎంతో మంది సినీ రచయితలు ఇలా అమ్మగురించి పాడిన పాటలు అమ్మలోని గొప్పతనానికి నిదర్శనం.. నేడు ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం 6లో..

పనులు త్వరతగతిన పూర్తి చేయాలి

- ఇరిగేషన్ ప్రాజెక్టు పనులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష
- పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణ పరిధిలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులతో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరతగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి శనివారం ఆమె మిర్యాలగూడ పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని తడకమళ్ల సర్కిల్, వైజంక్షన్, సాగర్‌రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కళాభారతిలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పౌరసేవలు విస్తరించాలన్నారు. అవసరమైతే అదనపు ఉద్యోగులను పురపాలికలో నియమించుకోవాలన్నారు. రహదారులు విస్తరించాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా ఉన్న ఫౌంటెన్లను సరిచేయాలన్నారు. పట్టణంలో నిత్యం వెలువడుతున్న 50 టన్నుల వ్యర్థాలు డంప్ చేసేందుకు అనువైన డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేసేందుకు స్థలం ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత డంప్ యార్డుతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఫ్లైఓవర్ వద్ద ట్రాఫిక్ రద్దీని నివారించాలని, ఆ ప్రాంతంలో మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పై అంశాలకు అవసరమైన ప్రతిపాదనలను తన కార్యాలయానికి పంపాలని సూచించారు. మునిసిపల్ శాఖకు రెవెన్యూ, ఆర్ అండ్‌బీ అధికారులు సహకరించాలని సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, డీఎస్పీ రాజశేఖరరాజు, మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, తహసీల్దార్ లచ్చిరాం, వెంకటరమణ, వెంకన్న, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి

ఇరిగేషన్ ప్రాజెక్టు పనులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ కింద భూసేకరణ పూర్తయిన నేపథ్యంలో తదుపరి ప్రక్రియ మొదలుపెట్టాలని, చెల్లింపులకు చర్యలు తీసుకోవాలన్నారు. సాగర్ నియోజకవర్గంలోని నిడమనూరు చెరువుకు సాగర్ మెయిన్ కెనాల్ నుంచి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దున్నపోతులగండి, వీర్లపాలెం లిఫ్ట్‌లకు భూసేకరణ చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, ఇరిగేషన్ ఎస్ఈ మల్లిఖార్జున్, ఈఈ కరుణాకర్, డీఈ కేశవ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

భారతసైన్యానికి మనోధైర్యం ఇవ్వాలి

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్

మునుగోడు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై యుద్ధం చేస్తున్న భారతసైన్యానికి మనోధైర్యం ఇవ్వాలని కేదారేశ్వరస్వామి దేవుడిని ప్రార్థించినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండల పరిధిలోని కోతులారం గ్రామంలో సాగుతున్న పార్వతీ సమేత కేదారేశ్వరస్వామి ఆలయం, నాభిశిల బొడ్రాయి తృతీయ వార్షికోత్సవ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందుండాలని, 400 ఏళ్ల చరిత్ర కల్గిన కేదారేశ్వరస్వామిని ప్రార్థించినట్లుగా తెలిపారు. పురాతన ఆలయం దీవెనలతో గ్రామస్థులు, సుఖసంతోషాలతో జీవించాలన్నారు. భవిష్యత్తులో ఈ ఆలయం తెలంగాణలోనే దివ్యక్షేత్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఆలయ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పున్న కైలాష్ నేత, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్, నాయకులు వట్టికోటి శేఖర్, మేకల ప్రమోద్‌రెడ్డి, పాల్వాయి జితేందర్‌రెడ్డి, భీమనపల్లి సైదులు, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, జాల వెంకన్న యాదవ్, పాలకూరి యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు కలిసి

ప్రభుత్వాన్ని నడపాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, మే 10 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రభుత్వాన్ని ముందుకు నడపాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. శనివారం నల్లగొండలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగులకు వివరించారని, వారంతా ప్రభుత్వంతో ఏకీభవించి అభివృద్ధిలో కలిసి వస్తున్నారన్నారు. ప్రపంచ సుందరీమణుల పోటీలకోసం ఇప్పటికే నాలుగైదు నెలల నుంచి సన్నాహాలు కొనసాగుతున్నాయని, ఇది ఒక్కదేశానికో, రాష్ట్రానికో సంబంధించిన వ్యవహారం కాదని, ప్రపంచ దేశాలన్నీ ఈపోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తాయని వెల్లడించారు. ప్రపంచసుందరీమణుల పోటీలకు, ఉగ్రవాదంపై జరుపుతున్న దాడులకు సంబంధం లేదన్నారు. దేశంలో ఏ రూపంలో ఉన్నా ఉగ్రవాదాన్ని అంతం చేసే సమయం ఆసన్నమైందని, ఉగ్రవాదులను తుదముట్టించడమే లక్ష్యంగా భారత భద్రతాదళాలు చేస్తున్న చర్యలకు దేశమంతా మద్దతిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు దేశరక్షణ నిధికి తాను ఒకనెల వేతనాన్ని అందిస్తానని, అదేవిధంగా ఎమ్మెల్సీలంతా తమ ఒక నెల వేతనం ఇచ్చే అంశంపై వారందరితో మాట్లాడుతున్నామని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. భారతదేశంలో పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదాన్ని తుదముట్టించాలని, పీఓకేని స్వాధీనం చేసుకోవడమే ఇందుకు మార్గమని సుఖేందర్‌రెడ్డి అన్నారు.



దేశ ఐక్యత, సమగ్రతకు కృషి చేయాలి

- నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు నెల జీతం విరాళం
- ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, మే 10(ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతకు, సమగ్రతకు కృషి చేయాలని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సైనికులు అహర్నిశలు పోరాడుతున్నారని అన్నారు. దాయాది దేశం పాకిస్థాన్ చేస్తున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఉగ్ర స్థావరాలపై విరుచుకు పడుతున్న భారత త్రివిధ దళాలకు మద్దతు తెలిపారు. తన ఒక నెల వేతనాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తున్నట్లు ప్రకటించారు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతించారు. తక్షణమే చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్పందించి తన విరాళాన్ని ప్రకటించారు. సహచర లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు కూడా తమ విరాళాలను అందించాలనని అభ్యర్థించారు.

సిబిల్ నిబంధన ఎత్తివేయాలి

మిర్యాలగూడ టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రుణాలకు సిబిల్ నిబంధన ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తుదారుల ఎంపిక సిబిల్ ఆధారంగానే జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మిర్యాలగూడ, మే 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ అధికారులను ఆదేశించారు. శనివారం కార్యాలయంలో మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం లక్ష్యంగా ఉందన్నారు. ఇప్పటివరకు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు చెప్పారు.

టీడీపీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి


సభ్యత్వ డిజిటల్ కార్డులను పంపిణీ చేస్తున్న అరుణ్ కుమార్

హాలియా, మే10(ఆంధ్రజ్యోతి): టీడీపీకి పూర్వ వైభవం తేవడానికి కృషి చేస్తానని సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వా అరుణ్‌కుమార్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ కార్డులను అనుముల మండలం కొత్తపల్లి, పంగవాని కుంటతండా, అల్వాల, తెట్టెకుంట, హాలియా, అనుముల, ఇబ్రహీంపేటలో ఆ పార్టీ దేవరకొండ నియోజ కవర్గ అధ్యక్షుడు వస్కుల కృష్ణయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్క రూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామ కమిటీలను వేశారు. అనుముల పార్టీ మండలాధ్యక్షుడు ఉడుతూరి నర్సింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు రామస్వామి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కంచర్ల వెంకన్న,షేక్ మిణుల్లా, దుబ్బ రాంబాబు, బి.వెంక టేశ్వర్లు, ఊర ఏసు, యం.వెంకటేశ్వర్లు, వస్కుల రాజేష్, శ్రీనివాస్, రామాంజిరెడ్డి, సీతారాములు, ఏలేటి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా,మే 10(ఆంధ్రజ్యోతి): హాలియా సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ధన్‌రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రక టనలో తెలిపారు.చెట్ల కొమ్మలు కొట్టడానికి ఇబ్రహీంపేట, పాలెం,చల్మారెడ్డిగూడెం, నాయుడుపాలెం, కొట్టాల, వీర్లగడ్డతండా, అల్వాల, పంగవానికుంట, అల్వాల ఎక్స్‌రోడ్డు, మలిగిరెడ్డిగూడెం, కొరివేనిగూడెం, శ్రీరాంపల్లి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆఖరి మజిలీకీ అవస్థలు

- శ్మశాన వాటికలో కరువైన వసతులు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు

పల్లె ప్రగతిలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో గ్రామంలో రూ.12.50 లక్షలతో నిర్మించిన వైకుంఠ ధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి. నిర్మాణాలు పూర్తయి ఏడాదిన్నర గడుస్తున్నా, ఆయా గ్రామాల్లో టాయిలెట్స్, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించకపోవడంతో ప్రజలు వినియోగించుకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో లక్షల రూపాయలతో నిర్మించిన వైకుంఠ ధామాలు కొన్ని గ్రామాల్లో అలంకార ప్రాయంగా మారాయి.

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

చింతపల్లి మండలంలో దాదాపుగా అన్ని గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో శ్మశానవాటిక (వైకుంఠధామం)లు నిర్మించింది. కానీ శ్మశానవాటికలు ఏర్పాటు చేసే క్రమంలో నీటి సౌకర్యం, రోడ్డు మార్గంతో పాటు, ప్రహరీ ఏర్పాటు చేయలేదు. దీంతో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశానవాటికకు రోడ్డుమార్గం లేకపోవడం, గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంగా ఉండడంతో అంతిమ వాహనం లేకపోవడంతో సొంత భూమిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గొడుకొండ్ల, పోలేపల్లి, రాంనగర్, ఎం.మల్లేపల్లి, మదనాపురం, చాకిలిశేరుపల్లి, ఉమ్మాపురం, తక్కెళ్లపల్లి, వింజమూర్, కుర్మపల్లి, సాయిరెడ్డిగూడెం, బోటిమిదితండా, నెల్వలపల్లి, తిరుమలాపురం, నసర్లపల్లి, హోమంతాలపల్లి, రాయినిగూడెం, గ్రామ శివారులో వైకుంఠధామాలు ఏర్పాటు చేశారు. రోడ్డుమార్గంతో పాటు నీటి సౌకర్యం, ప్రహరీ ఏర్పాలు చేయలేదు. రాత్రివేళల్లో కొన్ని గ్రామాల్లో శ్మశానవాటికల్లో కూడా ఆకతాయిలకు అడ్డాగా మారాయి. ఏర్పాటు చేసిన శ్మశానవాటికల్లో వసతి లేకపోవడంతో ఎవరూ కూడా దహనసంస్కారాలు చేయడానికి ముందుకు రావడం లేదు.



సాయిరెడ్డిగూడెం శ్మశానవాటికలో ఏపుగా పెరిగిన చెట్లు

మాల్ శ్మశానవాటిక

మాల్ పట్టణంలో తప్పని తిప్పలు..

రెండు జిల్లాల కూడలి ప్రముఖ విద్యావ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న గొడకొండ్ల గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో శ్మశానవాటిక 5 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో శ్మశానవాటికకు స్థలాలు కేటాయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల సమన్వయం లోపంతో రంగారెడ్డి, నల్లగొండ జిల్లా సరిహద్దు ప్రాంతంలోని 35 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో శ్మశానవాటిక నిర్మించారు. ని ర్మించి ఏడాది గడుస్తున్నప్పటికీ దహన సంస్కారాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు. వసతి సౌకర్యాల లేకపోవడంతో నిర్మించిన శ్మశానవాటికలు అలంకారప్రాయంగా మారాయి. ఇకనైనా అధికారులుక్షేత్రస్థాయిలో దృష్టి సారించి శ్మశానవాటికకు రోడ్డుమార్గంతో పాటు నీటి వసతి సౌకర్యం, వాహన సౌకర్యం ఏర్పాటు చేస్తే దహన సంస్కారాలు చేయడానికి ఉపయోగపడే అవకాశం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన శ్మశానవాటికల్లో కనీస వసతి సౌకర్యం లేదు. రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉండటం వల్ల పాత మాల్ నుంచి శవాన్ని తరలిస్తున్నప్పుడు గ్రామస్థులు ఒప్పుకోవడం లేదు. వెంకటేశ్వర ఆలయ సమీపం లో ఏర్పాటు చేసిన శ్మశానవాటికల్లో వసతి సౌకర్యాలు లేవు. శ్మశానవాటికలకు ప్రహరీతో పాటు స్నానాలకు నీటి సౌ కర్యం ఏర్పాటు చేయాలి.

- సందపట్ల రాముసాగర్,(వీ.టీ.నగర్).

ప్రతిపాదనలు తయారుచేశాం



శ్మశానవాటికలకు నీటి వసతి సౌకర్యం, రోడ్డు మార్గం కల్పించేందుకు ప్రతిపాదన సి ద్ధం చేశాం. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తా. రోడ్డు మార్గం, స్నానాలకు కావాల్సిన నీటి వసతితో పాటు ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తా.

రమాకాంత్‌శర్మ, తహసీల్దార్, చింతపల్లి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన భిక్షమయ్య

చింతపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వింజమూర్ శివారు మూల మలుపు వద్ద శనివారం జరిగింది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వింజమూర్ గ్రామానికి చెందిన కంటాల శ్రీను, కంటాల భిక్షమయ్య బైక్‌పై చింతపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి సాగర్‌వైపు వెళ్తున్న కారు వింజమూర్ గేట్ సమీపంలో ఉన్న మలుపు వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మాల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కలిగిస్తున్న రవీందర్‌రెడ్డి

నిడమనూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని పతంజలి కంపెనీ జిల్లా సీనియర్ మేనేజర్ నర్రా రవీందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేంపాడ్‌లో శనివారం ఆయిల్ పామ్ తోటల సాగు, గెలల నాణ్యతా ప్రమాణాల మీద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆయిల్ పామ్ గెలలను కోసిన 24 గంటల్లోపు ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ ఆఫీసర్ భరత్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు రాంప్రసాద్, సతీష్, నరేంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

రంగమ్మకు ప్రముఖుల నివాళి

మాడ్గులపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోరెడ్డి వెంకట్‌రెడ్డి తల్లి రంగమ్మ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ, నాగార్జున సాగర్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ గ్రామానికి చేరుకొని రంగమ్మ మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, కాంతారెడ్డి, నాయకులు జూలకంటి సైదిరెడ్డి, నరేందర్, జానయ్య, అక్కయ్య, వెంకట్‌రెడ్డి, సైదిరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గోర్‌బోలి భాషను ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, గిరిజన సంఘం నాయకులు

హాలియా, మే 10(ఆంధ్రజ్యోతి): లంబాడీలు, బంజారాలు మాట్లాడే గోర్‌బోలి భాషను కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 24,25 తేదీల్లో హాలియాలో నిర్వహించే రాష్ట్ర గిరిజన సంఘం విద్యా వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాన్ని స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బోర్ బోలి బాషను లిపి లేకపోయినా భారత దేశంలో 11 రాష్ట్రాల్లోమాట్లాడుతున్నారన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం గోర్‌బోలి భాషను ఎనిమిదో షెడ్యు ల్‌లో చేర్చాలని ఏకగ్రీవ తీర్మాణం చేసి కేంద్రానికి పంపామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్‌నాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, కొర్ర శంకర్‌నాయక్, రమావత్ నరేష్, నేనావత్ అశోక్‌నాయక్, రమావత్ లాలునాయక్, రమావత్ రమేష్‌నాయక్, నేనావత్ మునినాయక్, కుర్ర మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డి కుటుంబానికి పరామర్శ

నిడమనూరు : మండలంలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్‌అండ్‌బీ డీఈఈ ఎదుళ్ల సత్యనారాయణరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విష యం తెలుసుకున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు ఎదుళ్ల నర్సింహారెడ్డి, అంకతి సత్యం, యడవల్లి వల్లభ్‌రెడ్డి, నందికొండ మట్టారెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, శివమారయ్య, నర్సింగు విజయ్, దయాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉగ్రవాద కుట్రలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాద కుట్రలను తిప్పికొట్టాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండో-పాక్ యుద్ధం వల్ల ఇరుదేశాలకు నష్టం వా టిల్లు తుందన్నారు. కశ్మీరులో ఉగ్రవాదులు విచక్షణరహితంగా కాల్పులు జరిపి 28 మంది అమాయక టూరిస్టులను హత్యచేయడం భారతీయులందరిని కలిచి వేసిందన్నారు. అందుకు పాకిస్థాన్ కనీస పశ్చాత్తాపం ప్రకటించకపోగా కాల్పుల ఘటనకు బాధ్యులైన ఉగ్రవాదులను ఇండియాకు అప్పగిస్తామని చెప్పక పోవడంతో భారత్ ప్రతీకార చర్యలకు దిగిందన్నారు. రెండు దేశాలు కాల్పుల ఒప్పందానికి ముందుకు రావడం మంచి పరిణామం అన్నారు. యుద్ధంలో మరణించి జైవాన్లకు ప్రజలకు నివాళులు అర్పిస్తున్న ట్లు చెప్పారు. శాంతి చర్చలు చేసి యుద్ధాన్ని నివారించాలని సీపీఎం ఆకాంక్షిస్తోందని అన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, తిరుపతి రాంమూర్తి, పాదూరి గోవర్ధనా, పరశురాములు, పాదూరి శశిధర్‌రెడ్డి, ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలి

చింతపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలనుగుర్తించి నష్ట పరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయ డంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫల మైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆయన ఆరోపించారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు

మిర్యాలగూడ టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం వీరమరణం పొందిన భారతజవాన్ మురళీ నాయక్‌కు నివాళులర్పిస్తూ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శనతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల పార్కులో మురళీనాయక్ చిత్ర పటం నివాళులర్పిస్తున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు, నీరుకంటి నారాయణ, పొదిల శ్రీను, స్కై లాబ్ నాయక్, ఎంఏ. సలీం, నర్సిరెడ్డి, మురళీ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

దేవరకొండ: పాకిస్తాన్ సైనికుల కాల్పుల్లో భారత జవాన్ మురళీనాయక్ మృతికి నివాళులర్పిస్తూ దేవరకొండలో స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మీనాక్షి చౌరస్తా నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు(ఎన్‌వీటీ) మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో దేశ రక్షణ కోసం పోరాడి మురళి నాయక్ వీరమరణం పొందాడని అన్నారు.కార్యక్రమంలో మాజీ సైనికులు జక్క శీనయ్య, పాపనాయక్, రాం సింగ్, క్రాంతి, సుజాత, నర్సింహ, విద్యార్థులు పాల్గొని వీర జవాన్‌కు నివాళులు అర్పించారు.

దామరచర్ల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్ జవాన్ వీరమరణ పొందగా మండలంలోని నర్సాపురం గ్రామస్థులు గ్రామంలో కొవ్వత్తులతో ర్యాలి నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ మారుమూల గిరిజనతండాకు చెందిన గిరిజన ముద్దుబిడ్డ మురళీనాయక్ దేశ రక్షణలో భాగంగా అగ్నివీర్‌లో చేరి తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పాకిస్తాన్ ఉగ్రవాదులను సుమారు ఐదు నుంచి పది మందిని చంపి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించాడని అన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భారత్ విజయం సాధించాలి

దేవరకొండ : ఆపరేషన్ సిందూర్‌లో భారత్ విజయం సాధించాలని దేవరకొండ తుల్జామ్మకుంట ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం బీజేపీ నేతలు పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండాల అంజయ్య యాదవ్, చండీశ్వర్, అంజినాయక్, రవీందర్, లక్ష్మణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


దేవరకొండలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

పోలీసులు వేధిస్తున్నారని రైతు ఆత్మహత్యాయత్నం

- భూవివాదమే కారణం

గుర్రంపోడు, మే10(ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో పోలీసులు తమను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామానికి గోలి వెంకటేశ్వర్లు 1.04ఎకరాలు, ఐతరాజు రాజు, రమేశ్‌కు 2.20ఎకరాలు సర్వే నంబర్ 524లో పక్కపక్కనే భూమి ఉంది. అయితే తన భూమిలో అక్రమంగా ప్రవేశించి గడ్డికట్టలు వేశారని గోలి వెంకటేశ్వర్లు భార్య రేణుక ఏప్రిల్ 25న ఐతరాజు రమేష్, రాజుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పోలీసులు రమేష్, రాజును స్టేషన్‌కు పిలిపించడంతో సమస్యను పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకుంటామని చెప్పారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో శనివారం మళ్లీ రమేష్, రాజును పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు.

ఈ క్రమంలో ఐతరాజు రమేష్ తాను వెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బా మూత తీసి తాగడానికి ప్రయత్నిస్తుండగా గమనించిన పోలీసులు అడ్డుకున్నారు. వెంటనే గుర్రంపోడు పీహెచ్‌సీకి తరలించి చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా సర్వే నంబర్ 524లో తమకు ఉన్న 2.20ఎకరాల భూమి నక్షా, భూరికార్డుల ప్రకారం తమకే చెందుతుందని ఈ భూమిలో ప్రస్తుతం గోలి వెంకటేశ్వర్లు కబ్జాలో ఉన్నాడని, తమ హక్కు మేరకే గడ్డికట్టలు వేసుకున్నామని రమేష్ భార్య రామలింగమ్మ తెలిపింది. తమకు న్యాయం జరగడం లేదని, తరచూ తమనే పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విషయమై ఎస్‌ఐ మధును వివరణ కోరగా బ్లాక్‌మెయిల్ చేసేందుకే రమేష్ పురుగుల మందు తాగాడని తెలిపారు.


నల్లగొండలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమేష్